


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




కరీంనగర్ | 24-06-2026 బుధవారం | సంపుటి : 14 | సంచిక :188 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on



## గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోండి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందింది

కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు తుమ్మల విజ్ఞప్తి

సివిల్ ఏవియేషన్ తరపున ఫీజిబులిటీ సర్వే

చేసినందుకు కేంద్రమంత్రి రామ్మోహన్

నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు

**న్యూఢిల్లీ, జూన్ 23 (వుదయం బ్యూరో) :** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# రెండో విడత 65 పద్మాలు

65 మంది ప్రముఖులకు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు

తొలి విడతలో 66 మందికి ప్రధానం

మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ • సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలు • సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులకు అవార్డులు









ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల రెండో విడత ప్రదానోత్సవానికి హాజరైన ప్రధాని, లోక్ సభ స్పీకర్, హోంమంత్రి తదితరులు



**న్యూఢిల్లీ, జూన్ 23 (వుదయం బ్యూరో) :** ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల రెండో విడత ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం సాయంత్రం ఈ అవార్డులను ప్రదానం చేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మ విభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మొత్తం 65 మంది ప్రముఖులకు ఈ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు లాక్కోవడం

## దుర్మార్గం

పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోం

ఇందిరమ్మ రాజ్యమంటూనే

పేదల ఇళ్లు కూలగొడుతోంది

మాజీ మంత్రి హరీశ్‌రావు



**ఖమ్మం, జూన్ 23 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఏ ప్రభుత్వమైనా పేదలకు భూములు ఇస్తుంది.. ఈ సర్కారేమో పేదల నుంచి భూములు లాక్కుంటుందని ధ్వజమెత్తారు. చెప్పేదేమో ఇందిరమ్మ రాజ్యం.. చేసేదేమో హిట్లర్ రాజ్యం అని దుయ్యబట్టారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం సర్వే నంబర్ 218లో ప్లాట్లు కోల్పోతున్న బాధితులు మంగళవారం ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును కలిసి తమ గోడును వెల్లబోసకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదలకు ఇండ్లు ఇవ్వాలి.. ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.

మిగతా 2లో

## హైదరాబాద్ మెట్రో స్వాధీనం, విస్తరణకు గ్రీన్ సిగ్నల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్చలు సఫలం

ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఈ చర్చలతో

తొలగిపోయాయిన ఆటంకాలు

40 నిమిషాల పాటు సాగిన సమావేశం

**హైదరాబాద్, జూన్ 23 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు

మిగతా 2లో

## రూ. 30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై రేవంత్ కన్ను

హైదరాబాద్ మెట్రో రైల్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు

30 వేల కోట్ల రూపాయల ఆస్తులను తన కుటుంబ సభ్యులకు,

అన్నదమ్ములకు, అనుచరులకు అప్పజెప్పే భారీ కుంభకోణం

అందుకే మెట్రో రైల్ ఎల్ అండ్ టి అధికారులను

బ్లాక్ మెయిల్ చేసి వారిని రాష్ట్రం నుంచి తన్ని తరిమేశారు

అందుకే 14,000 కోట్ల రూపాయల ఎల్ అండ్ టి

అప్పును రాష్ట్ర ప్రజలపై రుద్దుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ మెట్రో పట్ల చిత్తశుద్ధి ఉంటే గత ప్రభుత్వం

ప్రతిపాదించిన మెట్రో విస్తరణకు బీజేపీ ఎందుకు ఆమోదం తెలుపలేదు?

రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి కలిసి ప్రజల దృష్టి ఆకర్షించే విఫల ప్రయత్నం

శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో కేటీఆర్



2 సంవత్సరాలలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో ఎమ్మెల్యే గాంధీ చెప్పాలి

**హైదరాబాద్, జూన్ 23 (వుదయం ప్రతినిధి :** బీఆర్ఎస్ తరపున కార్యకర్తల కష్టంతో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన అవినీతి, అక్రమాలను కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి మారారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఆయననే గతంలో పదేళ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క శేరిలింగంపల్లి నియోజకవర్గానికి 9,500 కోట్ల రూపాయలతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో

మిగతా 2లో

## అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సరఫరా ఉండాలి

- గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా
- స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు
- అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై మంత్రి సీతక్క సమీక్ష




**హైదరాబాద్, జూన్ 23 (వుదయం ప్రతినిధి:** గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు.

మిగతా 2లో

మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు..

## ఇప్పుడూ నమ్మం



యుద్ధం ముందున్న స్థితికి హర్మూజ్ ఎప్పటికీ

తిరిగిరాదు : ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్

హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉంది: ట్రంప్

2

నీచ ప్రయత్నాలకు

## పాల్పడుతోన్న పాక్



మీ తప్పులను సరి చేసుకోవడానికి భారత్‌పై నిందలు

భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి

రణ్‌ధీర్ జయస్వాల్ పాక్‌కు స్ట్రాంగ్ కౌంటర్

2

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు




కొత్త ఫీజులు అమల్లోకి వస్తే

75 శాతం మేర భారం

710 డాలర్ల నుంచి

1280 డాలర్లకు ఫీజు

2



# పేదల ఇళ్లు లాక్కోవడం దుర్మార్గం

మొదటి పేజీ తరువాయి

తెలిసో, తెలియకో పేదోడు కబ్జా చేస్తే పట్టాలు ఇవ్వాలి. కానీ రక్షించే వాడే భక్షకుడు అయ్యాడు. ఖమ్మంలో రెవెన్యూ మంత్రి ఉండి కూడా ఉపయోగం లేదు. రెవెన్యూ మంత్రి అంటే ఇళ్ల స్థలాలు ఇస్తారు, ఇండ్లు కట్టిస్తారు. పేదలకు పట్టాలిస్తారు. జీవో 59 కింద రెగ్యులరైజ్ చేస్తారు. ఖమ్మం జిల్లా దురదృష్టమో ఏమో కానీ, ఇక్కడ రివర్స్ అయ్యింది. మొన్న వెలుగుమట్ల ఇప్పుడేమో రఘునాథపాలెంలో షురూ చేశారు. వెలుగుమట్లలో పేదల జోలికి వస్తే రాష్ట్రమంతా కాంగ్రెస్ ప్రభుత్వ పరువు పోయింది. వీళ్ళకి ఇంకా బుద్ధి రాలేదు. సోయి రాలేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గతంలో సర్వే నెంబర్ 218లో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు, స్థలాలు ఇచ్చింది. కరెంటు పోల్స్, నల్లా కలెక్షన్లు ఏర్పాటు, ప్లాట్లకు నెంబర్లు కూడా కేటాయించింది. చేతనైతే మీరు ఇల్లు కట్టించండి. ఇంటికి సాయం చేయండి. అసంపూర్తిగా ఉంటే పూర్తి చేయాలి. కానీ ఇల్లు లాక్కునే పరిస్థితి బాధాకరం. తక్షణమే ఆ ఆలోచన విరమించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అమాయకుల దగ్గర, పేదల దగ్గర జాగాలు లాక్కోద్దని కలెక్టర్‌కు గట్టిగా చెప్పానని హరీశ్‌రావు తెలిపారు. రాత్రికి రాత్రి జేసీబీలు తెచ్చి ఇండ్లు కూలగొడుతున్నారు. ఇల్లు కట్టే ప్రభుత్వం కాదు ఇది, కూల్చే ప్రభుత్వం. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో కూలగొడుతున్నాడు, ఇక్కడ పొంగులేటి జేసీబీలు పెట్టి ఇల్లు కూలగొడుతున్నాడు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేసీఆర్ ప్రభుత్వం ఇస్తే అది కూడా ఆక్రమించుకున్నారు.

కేసీఆర్ క్యాబినెట్‌లో పెట్టి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. తక్షణమే ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే జర్నలిస్టులకు మేమే పొజిషన్ ఇప్పిస్తాం.. మేము వాళ్లతో పాటు వెళ్లి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటున్నారు, అక్కడ ఇబ్బంది లేనప్పుడు.. ఖమ్మంలో కేసీఆర్ ఇచ్చిన జీవో వల్ల ఎక్కడ ఇబ్బంది వస్తుంది. ఏమి అడ్డంకి ఉందో రెవిన్యూ మంత్రి చెప్పాలని ప్రశ్నిస్తున్నా. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఇచ్చినప్పుడు అదే చట్టం ప్రకారం ఖమ్మంలో ఇవ్వొచ్చు కదా..? అని హరీశ్‌రావు నిలదీశారు.

అయినా పేదల ఇండ్లు కూల్చడం ఏంటి..? వెలుగుమట్ల తర్వాత కూడా మీ కళ్ళు చల్లబడలేదా. వెలుగుమట్ల పేదల కన్నీళ్లు చూశాక కూడా రఘునాథపాలెంలో అదే చేయాలనుకుంటున్నారా..? పిచ్చిపిచ్చి ఆలోచనలు విరమించుకోండి. నేషనల్ హైవే పేరుతో కొన్ని, ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో కొన్ని ప్లాట్లు తీసుకున్నారు. అన్ని పోయినా మిగిలిన ప్లాట్లు కూడా ఎందుకు లాక్కుంటున్నారు. పేదలు స్కూల్ పక్కన, జాతీయ రహదారి పక్కన ఇల్లు కట్టుకుంటే మీ కళ్ళు ఓర్వడం లేదా..? ఈ స్థలం విలువైంది కాబట్టి గరీబోళ్ల దగ్గర లాక్కుంటున్నారా..? వాళ్లకు ఇంత విలువైన స్థలాలు అవసరమా అనుకుంటున్నారా.

ఆనాడు కేసీఆర్ ఇచ్చారు. వాళ్ళ అదృష్టం బాగుంది భూముల ధరలు పెరిగాయి. కేసీఆర్ ఇచ్చిన ప్లాట్లకు పేదలను ఓనర్లను చేయండి. అంతేగాని ఆ ప్లాట్లు గుంజుకుంటామంటే ఊరుకోబోము. ఆలోచన విరమించుకోవాలి.. లేదంటే మరో వెలుగుమట్ల పునరావృతం చేస్తామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు.



# 30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపైన రేవంత్ కన్ను

మొదటి పేజీ తరువాయి

ఒక ప్రగతి నివేదికను విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మరి రెండు సంవత్సరాలలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో ఎమ్మెల్యే గాంధీ చెప్పాలన్నారు.మళ్లీ శేరిలింగంపల్లిలో గులాబీ జెండా ఎగరాలి అంటే కార్యకర్తలంతా కలిసికట్టుగా కదం తొక్కాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో మంగళవారం కేటీఆర్ మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఎప్పుడు క్యాలెండర్‌లో తేదీలు మారుతాయా, కేసీఆర్ ఎప్పుడు తిరిగి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తారా అని ఎదురుచూస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కెపి వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సరఫరా ఉండాలి

మొదటి పేజీ తరువాయి

జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని సీతక్క ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

**కొత్త ఫీజులు అమల్లోకి వస్తే**

**75 శాతం మేర భారం**

**710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు**



**వాషింగ్టన్, జూన్ 23 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికొస్తే.. 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే.. దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే.. ఖర్చుల మోత మోగనుంది. ఆ రుసుము 830 డాలర్ల నుంచి 1475 డాలర్లకు అంటే 645 డాలర్ల మేర పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం.. దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డీహెచ్ఎస్ ప్రతిపాదించింది. 400 శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్‌డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు.. తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు.. ఇప్పుడూ నమ్మం



**యుద్ధం ముందున్న స్థితికి**

**హర్మూజ్ ఎప్పటికీ తిరిగిరాదు**

**ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్**

**హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉంది: ట్రంప్**

**టెహ్రాన్, జూన్ 23 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హర్మూజ్ జలసంధి పై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉంది. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు.మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే'' అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌పై



భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్–అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.



# కేంద్ర మంత్రులను కలిసిన రాష్ట్ర మంత్రులు తుమ్మల, ఉత్తమ్

**తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు**

**ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి**

**దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి**

**తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి**

**పప్పు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి**

**మొక్కజొన్న, జొన్నలను కేంద్రం MSPపై కొనుగోలు చేయాలి**

**న్యూఢిల్లీ, జూన్ 21 (వుదయం బ్యూరో) :** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన NMEO–OP కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు.

# తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు

**ఉద్యమకారుల గుర్తింపులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలి**

**చైర్మన్ కేకే కు వినతి పత్రాన్ని అందించిన టీయుడబ్ల్యూజే**

**హైదరాబాద్, జూన్ 23 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన చారిత్రాత్మక మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం నాడు టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావును బంజారా హిల్స్ లోని ఆయన నివాసంలో సమావేశమై వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించారని ఆయన అన్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజిక–ఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చారన్నారు. అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేసారు. ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటనలు ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయని, ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారన్నారు. అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారని, కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని, మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అయినా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని విరాహత్ తెలిపారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. కమిటీ చైర్మన్ కేకే ను కలిసిన వారిలో విరాహత్ అలీతో పాటు టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ. రాజేష్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**సమగ్రంగా అధ్యయనం చేసి న్యాయం చేస్తాం : కే. కేశవరావు**

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, రాజకీయ, రాజకీయేతర రంగాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కమిటీ చైర్మన్ కె. కేశవరావు టీయుడబ్ల్యూజే బృందంతో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆయా కోణాల్లో సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఉద్యమ సాక్ష్యాలను పరిగణలోకి తీసుకొని, ఆయా రంగాల ఉద్యమకారులను గుర్తించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు ఆయా జిల్లాల నుండి సేకరించిన సమాచార నివేదికలు, ఆయా వర్గాలతో ప్రత్యేక సంప్రదింపులు నిర్వహించి, ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో సీనియర్ పాత్రికేయులతో కూడా కమిటీ సమావేశమై వారి సలహాలు కూడా తీసుకుంటుందని కేశవరావు అన్నారు.



# హైదరాబాద్ మెట్రో స్వాధీనం.. విస్తరణకు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి



విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్–1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్–2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్ (రైల్వే శాఖ), జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర–రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్మాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఫేజ్–1 వాల్యూయేషన్: ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్–1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ (వాల్యూయేషన్) రుణ సేకరణపై SBICAPS రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్–2 నివేదిక: ఫేజ్–2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది.



# అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా క్రీడాకారులు, క్రీడాభిమానులకు సిఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్ 23 (వుదయం ప్రతినిధి) :** ప్రపంచంలోనే అతి పెద్ద క్రీడా మహోత్సవమైన ఒలింపిక్స్‌కు ప్రతీకగా నిర్వహించే అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా క్రీడాకారులు, క్రీడాభిమానులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రపంచ వ్యాప్తంగా క్రీడాకారుల మధ్య ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వ భావాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు ఈ దినోత్సవం సందర్భంగా లింగ, వయసు, సామర్థ్యాల పరంగా ఎలాంటి వివక్ష లేకుండా క్రీడా రంగంలో సమాన అవకాశాలు కల్పించే వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ, ఐక్యత, శాంతికి ప్రతీకగా నిలుస్తున్న ఈరోజున క్రీడాకారులు తమ లక్ష్యాల సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అలుపెరగని ప్రయత్నమే నిజమైన విజయానికి నాంది పలుకుతుందని, క్రీడారంగంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో అధిగమిస్తూ, ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయడానికి అంతర్జాతీయ ఒలింపిక్స్ దినోత్సవం ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు.

# నీచ ప్రయత్నాలకు పాల్పడుతోన్న పాక్

**మీ తప్పులను సరి**

**చేసుకోవడానికి భారత్‌పై నిందలు**

**భారత విదేశాంగ శాఖ అధికార**

**ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్**

**పాక్‌కు స్ట్రాంగ్ కౌంటర్**

**న్యూఢిల్లీ, జూన్ 23 (వుదయం బ్యూరో) :** పీఓకేలో ఆందోళనలతో పాటు సింధూ జలాల ఒప్పందానికి సంబంధించి పాక్ మంత్రి చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ దేశం ఇలాంటి నీచ ప్రయత్నాలకు పాల్పడుతోందని మండిపడింది. ఆ మంత్రి చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమేనని తేల్చి చెప్పింది. ఇటీవల పాక్ ఆక్రమిత కశ్మీర్ లో హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇటీవల పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ మాటాడుతూ.. ఈ



ఆందోళనల వెనుక భారత్ ప్రభావం ఉందంటూ నోరు పారేసుకున్నారు. అంతటితో ఆగకుండా.. పాకిస్థాన్ నీటి భద్రతకు ముప్పు వాటిల్లిందని భావిస్తే భారత్‌పై యుద్ధానికి కూడా వెనుకాడబోమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో స్పందిస్తూ ఖవాజా వ్యాఖ్యలకు దీటుగా బదులిచ్చారు.

**సింధు జలాలపై భారత్‌తో యుద్ధానికైనా సిద్ధం**

''తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ఆ దేశంలో జరుగుతోన్న మానవ హక్కుల ఉల్లంఘన నుంచి ప్రపంచం దృష్టి మళ్లించేందుకు పాక్ ఇలాంటి విఫల ప్రయత్నాలు చేస్తోంది. ఈ కల్పిత ఆరోపణలను మేం తోసిపుచ్చుతున్నాం. పాకిస్థాన్ బలవంతపు ఆక్రమణలో ఉన్న ప్రాంతాలలో (పీఓకేను ఉద్దేశిస్తూ) దశాబ్దాలుగా ఆర్థిక దోపిడీ కొనసాగుతోంది. అక్కడి ప్రజలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు. పాలనాపరమైన అణచివేత విధానాల ఫలితంగానే ప్రస్తుతం అక్కడ నిరసనలు జరుగుతున్నాయి. ఆ ఆందోళనలపై పాక్ ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోంది. అమాయక పౌరులపై కాల్పులు చేయడంతో పాటు ఔషధ సరఫరా, ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసింది. ఈ బలవంతపు చర్యల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దురాగతాలకు గానూ అంతర్జాతీయ సమాజం పాక్‌ను జవాబుదారీగా నిలబెడుతుందని ఆశిస్తున్నాం'' అని రణ్‌ధీర్ వెల్లడించారు.



# గ్రేటర్ హైదరాబాద్



## గజ్వేల్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్

**కేసుల ఇన్వెస్టిగేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి**
**ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం**
**కార్యాలయ నిర్వహణలో '5S' విధానాన్ని పాటించాలి**

**గజ్వేల్, జూన్ 23 (ఉదయం ప్రతినిధి)**

వార్షిక తనిఖీలలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, మంగళవారం గజ్వేల్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించి, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని రకాల రికార్డులను, కేస్ ఫైళ్లను ఆమె నిశితంగా పరిశీలించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, స్థితిగతులతో పాటు కార్యాలయ ప్రాంగణం, రికార్డుల నిర్వహణను ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు మరియు ఇతర తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఇన్వెస్టిగేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని గజ్వేల్ ఏసిపి నర్సింలును సీపీ ఆదేశించారు.

కార్యాలయంలోని అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆఫీస్ మేనేజ్‌మెంట్‌లో తప్పనిసరిగా '5S' విధానాన్ని పాటించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదు దారుడితో ఓపికగా మాట్లాడి, వారి సమస్యలను వినాలని సీపీ స్పష్టం చేశారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి గ్రీవెన్స్ (సమస్య) పూర్తిగా పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఫిర్యాదు దారులతో పోలీసులు ఓపికగా వ్యవహరించాలి. ముఖ్యంగా మహిళలు, బాలలు, వెనుకబడిన వర్గాల కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకూడదు అన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలుతో పాటు గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల్లో బ్యాంకులు చురుగ్గా

**రంగారెడ్డి జిల్లా**

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో బ్యాంకులు మరింత చురుకైన పాత్ర పోషించాలి - జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిరంగారెడ్డి జిల్లా బ్యాంకింగ్ కార్యకలాపాలు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు పురోగతిని సమీక్షించేందుకు జిల్లా సంప్రదింపుల కమిటీ (District Consultative Committee DCC) సమావేశం మంగళవారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ శ్రీ సి. నారాయణ రెడ్డి అధ్యక్షత వహించగా, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ సుశీల్ కుమార్ కె.పి. సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అన్ని వాణిజ్య బ్యాంకుల ప్రతినిధులు, వివిధ జిల్లా శాఖల అధికారులు, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI), నాబార్డ్ (NABARD) అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయ రుణాలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు (MSME)



రుణాలు, విద్యా రుణాల పంపిణీ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రైతులకు, స్వయం ఉపాధి యూనిట్లకు, యువ పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు మరింతగా రుణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా చిన్న వ్యాపార యూనిట్ల అభివృద్ధికి తగిన రుణాలు అందించడం, ఎంఎస్ఎంఈ రంగానికి క్రెడిట్ వృద్ధిని వేగవంతం చేయడం, అందుబాటు గృహ రుణాలను ప్రోత్సహించడం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయడం పట్ల బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ సుశీల్ కుమార్ కె.పి. మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాయోజిత వివిధ పథకాల కింద రుణ ప్రవాహాన్ని పెంచడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అన్ని బ్యాంకులను కోరారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధి, సమగ్ర ఆర్థిక చేర్పు (Financial Inclusion) సాధనకు బ్యాంకులు మరియు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని సమావేశంలో కలెక్టర్ పేర్కొన్నారు. రుణాల మంజూరు ప్రక్రియను మరింత సరళీకృతం చేయడం, రుణ పంపిణీలో ఉన్న అవరోధాలను తొలగించడం, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందించే చర్యలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా 202627 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ ప్రణాళిక (Annual Credit Plan - ACP) ను ఆవిష్కరించారు. ఈ ప్రణాళికలో ప్రాధాన్య రంగం (Priority Sector) కోసం రూ. 32,175 కోట్ల రుణ లక్ష్యాన్ని, ప్రాధాన్యేతర రంగం (NonPriority Sector) కోసం రూ. 56,144 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు.జిల్లా అభివృద్ధి, ఉపాధి కల్పన, పారిశ్రామిక వృద్ధి, వ్యవసాయ ప్రగతి మరియు సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధనలో బ్యాంకులు ప్రభుత్వ భాగస్వాములుగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

## క్రీడలు ఆరోగ్యకరమైన జీవనశైలికి స్ఫూర్తి




**నారాయణపేట జూన్ 23 (ఉదయం ప్రతినిధి)**

క్రీడలు ఆరోగ్య కరమైన జీవన శైలికి స్ఫూర్తి అని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు అనంతషయన సాయినాథ్ ,కార్యదర్శి బాల్ రాజ్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ ఒ లంపిక్ దినోత్సవాన్ని జిల్లా వ్యాయమా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో క్రీడామైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అథ్లెటిక్స్ కోచ్ హారిక దేవిని పూల మాల శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతు క్రీడాల్లో జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలొ ప్రతిభను కనబరచి ఒలాంపిక్ స్థాయిలొ రాణించి పేట జిల్లా పేరును నలు దిశల్లో చాటాలన్నారు. ఈకార్యక్రమంలొ బాల కేంద్ర సుపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి ,వెంకటప్ప, సంగ నర్సింహులు ,మాజీ కౌన్సిలర్ గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక సదస్సు




**రంగారెడ్డి జిల్లా**

జిల్లాలో ఎగుమతుల ప్రోత్సాహానికి సమీకృత మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహణ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రూ.100 మిలియన్లకు పైగా ఎగుమతి విలువ కలిగిన 120 జిల్లాలను కేటగిరీఏ (CategoryA) జిల్లాలుగా గుర్తించగా, వాటిలో రంగారెడ్డి జిల్లా కూడా చోటు దక్కించుకుంది. జిల్లాలో ఎగుమతుల సామర్థ్యాన్ని మరింత పెంపొందించడంతో పాటు, ఇప్పటికే వివిధ ఉత్పత్తులను తయారు చేస్తున్న పరిశ్రమలు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసేలా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన నేపథ్యంలో, District as Export Hub (DEH) కార్యక్రమం కింద మంగళవారం (23 062026) సమీకృత మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (DGFT) అధికారుల సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ ఎస్.ఎ. చవాన్, జాయింట్ డీజీఎఫ్‌టీ, శ్రీమతి ఎం. శ్రీలక్ష్మి, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం (DIC), శ్రీమతి ఎన్. సుమతి, అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ, శ్రీ టి. సుదిన్ పాల్, డిప్యూటీ డైరెక్టర్, కామర్స్ & ఎక్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ పాల్గొన్నారు. అలాగే ఏపీఈడీఏ (APEDA), నాబార్డ్ (NABARD), వాల్‌మార్ట్ (Walmart), ఈసీజీసీ (ECGC), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (STPI), ఇండియా పోస్ట్ తదితర ఎగుమతి ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, దాదాపు 50 సంస్థల ప్రతినిధులు మరియు పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు ఎగుమతులకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, ఎగుమతి నమోదు ప్రక్రియ, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు, ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు, డిజిటల్ వాణిజ్య వేదికల వినియోగం, ఈకామర్స్ ద్వారా ఎగుమతుల విస్తరణ వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. అదేవిధంగా, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న లాజిస్టిక్స్, ధృవీకరణలు, మార్కెటింగ్, ఆర్థిక సహాయం, బీమా, కస్టమ్స్ విధానాలు, విదేశీ మార్కెట్ల ప్రాప్తి వంటి వివిధ సమస్యలపై అధికారులు వివరాలు అందించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో ఫార్మాస్యూటికల్స్, ఐటీ ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తులు, హస్తకళలు మరియు ఇతర తయారీ రంగాల్లో విస్తృత ఎగుమతి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. "District as Export Hub" కార్యక్రమం ద్వారా జిల్లాను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేయడం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (MSMEs) ఎగుమతుల వైపు మళ్లించడం, స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో గుర్తింపు తీసుకురావడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, తయారీదారులు, స్టార్టప్‌లు మరియు ఎంఎస్ఎంఈ యూనిట్లు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఎగుమతుల రంగంలో ముందుకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు.

## రైతు వేదికల్లో విత్తన ప్రదర్శన మేళా ప్రారంభం



**గుమ్మడిదల, జూన్ 23 (ఉదయం):**

సన్నరకాల వరి సాగును ప్రోత్సహించేందుకు గుమ్మడిదల, కానుకుంట రైతు వేదికల వద్ద వారం రోజుల పాటు నిర్వహించనున్న విత్తన మేళాను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సన్నరకాల వరి విత్తనాలతో పాటు కంది విత్తనాలు, నానో యూరియా, డీఏపీ ఎరువులను రైతుల కోసం ప్రదర్శించారు.అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, జైశ్రీరామ్, హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎం1638, డబ్ల్యూజీఎల్44 వంటి రకాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అదే విధంగా వరికి బదులుగా కందులు, మక్కలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా రైతులు మళ్లాలని తెలిపారు.జాతీయ ఆహార భద్రతా పథకం కింద 100 శాతం రాయితీతో కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయగా, ఎంఏఎన్‌పీ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీపై ఇతర విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్, మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. కానుకుంట రైతు వేదికలో ఏఈవో వందన సన్నరకాల వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు

## మల్లికార్జున హిల్స్ కాలనీ అభివృద్ధి కోసం అధికారులకు వినతిపత్రం

**అమీన్‌పూర్ (ఉదయం):**

అమీన్పూర్ మండలం, బీరంగూడ లో నిమల్లికార్జున హిల్స్ కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కాలనీ ప్రతినిధులు కీలక చర్యలు చేపట్టారు. కాలనీవాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో శేరిలింగంపల్లి ఎస్ఎల్‌పీ జోన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పలు అభివృద్ధి పనులపై వినతిపత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి అత్యంత అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ (యూజీడీ) వ్యవస్థ ఏర్పాటు, పార్కు అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులను కోరారు.కాలనీలో రోడ్ల సమస్య కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో రహదారులపై నీరు నిల్వ ఉండటం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని కమిటీ సభ్యులు వివరించారు. అలాగే సమగ్ర యూజీడీ వ్యవస్థ ఏర్పాటు ద్వారా పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.అదేవిధంగా కాలనీలోని పార్కును అభివృద్ధి చేసి పిల్లలు, మహిళలు, వృద్ధులు వినియోగించుకునే విధంగా వాకింగ్ ట్రాక్, పచ్చదనం, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎంహెచ్ఎంఏ (MHMA) కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరితగతిన ఆమోదాలు పొంది పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీవాసుల సహకారంతో మల్లికార్జున హిల్స్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్లికార్జున హిల్స్ మెంబర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు రాఘవ రెడ్డి, హనుమంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి శివకుమార్, సంయుక్త కార్యదర్శులు సంగమేష్, పండరినాథ్, అశోక్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.



## భారీ వర్షా నికి అపార్ట్‌మెంట్ బేస్‌మెంట్‌లో నీట మునిగిన వాహనాలు

**బీరంగూడ (ఉదయం):**



సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బీరంగూడ ప్రాంతంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న నవ్య ఫ్రైడ్ అపార్ట్‌మెంట్‌లో నీరు భారీగా చేరి వాహనాలు నీట మునిగాయి. ఒక్కసారిగా భారీగా వర్షపు నీరు బేస్‌మెంట్‌లోకి చేరడంతో అపార్ట్‌మెంట్ నివాసితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.అపార్ట్‌మెంట్ బేస్‌మెంట్‌లో పార్క్ చేసి ఉన్న సుమారు 10 కార్లు, 20 ద్విచక్ర వాహనాలు పూర్తిగా నీటిలో చిక్కుకున్నాయి. రాత్రి సమయంలో నీటి ప్రవాహం పెరగడంతో వాహన యజమానులు వాటిని బయటకు తీసే అవకాశం లేకపోయింది.మంగళవారం ఉదయం అపార్ట్‌మెంట్ నిర్వాహకులు, స్థానికుల సహకారంతో మోటార్లను ఏర్పాటు చేసి బేస్‌మెంట్‌లో నిలిచిన నీటిని బయటకు పంపించారు. పలువురు నివాసితులు కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లే సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపించారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని, సంబంధిత అధికారులు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనతో అపార్ట్‌మెంట్‌లోని వాహనాలకు కొంత మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం. నీరు పూర్తిగా తొలగించిన అనంతరం నష్టం వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని నివాసితులు తెలిపారు.

## కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ.. బీఆర్ఎస్‌లోకి యువత భారీ చేరిక



**గుమ్మడిదల, జూన్ 23 (ఉదయం):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యువత బీఆర్ఎస్ వైపు ఆకర్షితమవుతోందని, ప్రజలకు సేవ చేసే నాయకత్వానికే భవిష్యత్తులో మరింత ఆదరణ లభిస్తుందని అన్నారు. కుమార్‌గౌడ్ మాట్లాడుతూ యువతకు అవకాశాలు కల్పిస్తూ వారి సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నవీన్, జహంగీర్, విష్ణు, అఖిల్, తేజ, సందీప్‌రెడ్డి, మహేందర్ తదితరులు ఉన్నారు.

## ముఖర్జీ బలిదాన్ దివస్: ఘననివాళులు

**బీరంగూడ (ఉదయం):**

భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ మహోన్నత వ్యక్తిత్వం కలిగిన గొప్ప జాతీయవాద నాయకుడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ పేర్కొన్నారు.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీరంగూడలో బీజేపీ అమీన్‌పూర్ పట్టణ కన్వినర్ ఆగరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం జరిగిన సమావేశంలో అదెల్లి రవీందర్ మాట్లాడుతూ, దేశ సమైక్యత, జాతీయత కోసం జీవితాంతం పోరాడిన మహానేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. భారతీయ జనసంఘ్ స్థాపన ద్వారా దేశ రాజకీయాల్లో జాతీయవాద భావజాలానికి బలమైన పునాదులు వేసిన నాయకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో, ప్రజల్లో దేశభక్తి భావాలను నింపడంలో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు.ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని, పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యత కోసం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చూపిన మార్గంలో నడవడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ పట్టణ బీజేపీ కన్వినర్ ఆగరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, శ్రవణ్, లక్ష్మణ్ గుప్తా, ఎడ్ల జనార్దన్, కిరణ్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొని శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులర్పించారు.





## తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్థల పరిశీలన

**- ప్రాంతీయ విద్యా సంచాలకులు ఎం సోమిరెడ్డి.**

**వెల్దండ జూన్ 23 (ఉదయం)**

తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా ఎంపికైన వెల్దండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం రాష్ట్ర ఈడబ్ల్యూఐడీసీ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్ రెడ్డి, జిల్లాస్థాయి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి హైదరాబాద్ ప్రాంతీయ విద్యా సంచాలకులు ఆర్జేడీ యం. సోమిరెడ్డి సందర్శించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపికైన ఈ జిల్లా పరిషత్ ఉన్నత, పాఠశాలలో ఉన్న భౌతిక వసతులు, ప్రస్తుతం ఉన్న తరగతి గదుల పరిస్థితి, విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ అవసరాలు, నిర్మాణ విస్తరణ అవకాశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ పాఠశాలలో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నిరంతర విద్యా విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు.విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఇంగ్లీష్ మీడియం బోధన గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చెయ్యనున్నారు. అలాగే క్రీడా మైదానాలు, ఇండోర్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదికలు, పోషకాహార భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, ఆధునిక మరుగుదొడ్లు, వైద్య సేవలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు , తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు నగర స్థాయి విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో ఈఈ ఈడబ్ల్యూఐడీసీ రామచంద్రరావు, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, ఎంఈఓ చంద్రుడు నాయక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE II ADDL. CHIEF JUDG:CITY CIVIL COURT. AT HYDERABAD**
**O.S. No. 418 Of 2025**

**Between:**
P.M. Sai Prasad . ...**Petitioner**
E.N. Ravi Kumar and Others. ......**Defendants**

To
1.E.N. Ravi Kumar, S/o. E. Narsing Rao, aged 41 years, Occ: Business, R/o. No. 5-255, Ambedkar Nagar, Old Alwal, Hyderabad -10.
2.Rupesh Raj, S/o. Not known to Plaintiff, Occ: Not known, R/o. No. 5-255, Ambedkar Nagar, Old Alwal, Hyderabad-10.
3.OK TV Media and Broadcasting Private limited, Represented by its Directors Sravya Ganti & Sumathi Devi Ganti
4. Sravya Ganti D/o Not known to Plaintiff, Occ: TV Presenter and Director of OK TV Media and Broadcasting Private limited
5.Sumathi Devi Ganti D/o. Not known to Plaintiff, Occ: Director of OK TV Media and Broadcasting Private limited,
**Above S.No.3,4 and 5 are all Regi Office R/o H No 8, Murthy Mansion, Pent House, 3-214/2, Above Medi Star hospital, Srinivasa Nagar, Ameerpet, Hyderabad-38.**
6. KR TV, Telugu Digital Media. Office. No. 7-1, Srinivas Nagar, Ameerpet, Hyderabad -38.
**(Defendants 1 to 5 and 12, 13)**

Please take notice that Mr. P.M. Sai Prasad has filed Succession O.S. No. 418 of 2025 on the file of above Hon'ble court seeking damages against 1 to 7 of you. Please take notice that the said case is posted to 13-07-2026 and 1 to 7 of you are called upon to appear before the Hon'ble court at 10-30 A.M. in person or through your Counsels. Otherwise the Hon'ble court would pass appropriate Orders.

***(BY ORDER OF THE COURT)***
Sd/-
**C.V. NARAYAN RAO,ADVOCATE**
**Flat No.303, 4TH FLOOR,No. 3-5-543 & 544**
**Laxminilayam, Narayanguda, Hyderabad -27**

**IN THE COURT OF HON'BLE VIII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT: AT: HYDERABAD**
**O.S. No. 4764 of 2021**

**Between:**
Srikanth Enterprises ...**Petitioner**
G. Narsamma & another ......**Defendants**

To
G. Narsamma W/o. Jangaiah Aged 55 years, occ: Business R/o. C/o. D. Gandamma H.No. 18-3-463/1/199, Shivajinagar Laxminagar, Hyderabad - 53.
... **(Defendant No. 1)**

WHEREAS the above-named plaintiff filed the above suit against the defendants seeking recovery of money. The said suit stand posted to 21-07-2026 for your appearance. Therefore, you are hereby directed to appear before the above said Court on the above said date at 10-30 AM in person or by Pleader duly instructed by you, positively, failing which the matter will be heard and determined ex-parte.

***(BY ORDER OF THE COURT)***
Sd/-
**K. SHASHIDAHR (TS/1963/ 2005)**
**Advocate**
**H.No. 1-10-122/26, 1st Floor, Street No. 8, Ashok Nagar, Hyderabad - 500020,**
**Cell. No 9848051273,**
**Email ID shashiattorney@yahoo.com.**







" తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ దేశం ఇలాంటి నీచ ప్రయత్నాలకు పాల్పడుతోంది. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ఆ దేశంలో జరుగుతోన్న మావన హక్కుల ఉల్లంఘన నుంచి ప్రపంచం దృష్టి మళ్లించేందుకు పాక్ ఇలాంటి విఫల ప్రయత్నాలు చేస్తోంది. ఈ కల్పిత ఆరోపణలను మేం తోసిపుచ్చుతున్నాం. పాకిస్థాన్ బలవంతపు ఆక్రమణలో ఉన్న ప్రాంతాలలో దశాబ్దాలుగా ఆర్థిక దోపిడీ కొనసాగుతోంది. అక్కడి ప్రజలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు. పాలనాపరమైన అణచివేత విధానాల ఫలితంగానే ప్రస్తుతం అక్కడ నిరసనలు జరుగుతున్నాయి. ఆ ఆందోళనలపై పాక్ ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోంది. అమాయక పౌరులపై కాల్పులు చేయడంతో పాటు ఔషధ సరఫరా, ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసింది. ఈ బలవంతపు చర్యల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దురాగతాలకు గానూ అంతర్జాతీయ సమాజం పాక్‌ను జవాబుదారీగా నిలబెడుతుందని ఆశిస్తున్నాం. "

- భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్

## వే'మన'పద్యం

ఆత్మశుద్ధి లేని యాచారమదియేల?
భాండశుద్ధి లేని పాకమేల?
చిత్తశుద్ధి లేని శివపూజలేలరా?
విశ్వదాభిరామ! వినురవేమ



# తాత్కాలిక ఆనందం... జీవితాంతం విషాదం

ఈ పోరాటంలో ప్రథమ రక్షణ కవచం తల్లిదండ్రులే. వారు తమ పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపాలి. పిల్లల ప్రవర్తనలో వచ్చే ఆకస్మిక మార్పులను (ఒంటరిగా ఉండటం, ఆకలి మందగించడం, ఎక్కువ డబ్బులు అడగడం, విపరీతమైన కోపం) నిశితంగా గమనించాలి. వారితో స్నేహపూర్వకంగా ఉంటూ, వారి మానసిక ఒత్తిడిని పంచుకోవాలి. వారి స్నేహితులెవరు, వారి ఆన్‌లైన్ వ్యాపకాలు ఏమిటనే దానిపై నిరంతర నిఘా ఉంచాలి. అలాగే విద్యాసంస్థల పాత్ర కూడా తక్కువేమీ కాదు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు క్రమబద్ధమైన కౌన్సెలింగ్ అందించాలి. కళాశాలల్లో డ్రగ్స్ రహిత కమిటీలను ఏర్పాటు చేసి విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలి. యువత తమ అపారమైన శక్తిని, సృజనాత్మకతను తప్పుడు మార్గాల్లో కాకుండా క్రీడలు, యోగా, ధ్యానం, సంగీతం, సాహిత్యం వంటి ఉత్పాదక రంగాల వైపు మళ్లించేలా ప్రోత్సహించాలి.

మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) నేడు ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజాన్ని, ముఖ్యంగా ఆధునిక నాగరికతను వేధిస్తున్న అత్యంత ప్రమాదకరమైన సామాజిక సంక్షోభం. ఒకప్పుడు కేవలం సంపన్న వర్గాలకో, విలాసవంతమైన నగరాలకో లేదా అంతర్జాతీయ స్మగ్లర్ల రహస్య స్థావరాలకో పరిమితమైన ఈ వ్యసన సంస్కృతి, నేడు నిశ్శబ్దంగా గ్రామీణ ప్రాంతాలకు, చివరకు పల్లెల్లోని సామాన్య కుటుంబాలకు సైతం విస్తరించడం అత్యంత ఆందోళనకరం. దేశ ప్రగతికి, భవిష్యత్తుకు వెన్నెముక లాంటి యువశక్తిని ఈ మహమ్మారి నీరు గారుస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, హాస్టళ్లు, వినోద కేంద్రాల నుంచి మొదలుకొని వినూత్న సాంకేతిక విప్లవమైన సోషల్ మీడియా వేదికల వరకు ఈ విషవలయం విస్తరించింది. యువత మాదక ద్రవ్యాల బారిన పడటం అనేది కేవలం ఒక వ్యక్తిగత ఆరోగ్య సమస్య లేదా నైతిక పతనం మాత్రమే కాదు; అది ఒక కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నానికి, ఆర్థిక నష్టానికి, శాంతి భద్రతల క్షీణతకు మరియు దేశ జాతీయ భద్రతకే పెను సవాలుగా పరిణమించిన ఒక బహుముఖ సంక్షోభం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), ఐక్యరాజ్య సమితి మాదక ద్రవ్యాలు, నేరాల నియంత్రణ సంస్థ (UNODC) విడుదల చేసిన అంతర్జాతీయ నివేదికలను పరిశీలిస్తే భయంకరమైన వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 కోట్లకు పైగా ప్రజలు వివిధ రకాల మాదక ద్రవ్యాలను వినియోగిస్తుండగా, అందులో సింహభాగం 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులే కావడం గమనార్హం. భారత దేశంలో కూడా గత దశాబ్ద కాలంలో డ్రగ్స్ వినియోగం ఊహించని రీతిలో, గణనీయమైన శాతంలో పెరిగింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ స్థాయి సర్వేల ప్రకారం, దేశంలో లక్షలాది మంది యువత సంప్రదాయ గంజాయి, అఫీములతో పాటు హెరాయిన్, కొకైన్ వంటి ప్రాణాంతక డ్రగ్స్ మరియు ఎల్ఎస్‌డీ (LSD), ఎండీఎంఏ (MDMA), మెథాంఫెటమైన్ వంటి సింథటిక్, రసాయన పదార్థాలకు తీవ్రంగా బానిసలవుతున్నారు. ముఖ్యంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై, జాతీయ రాజధాని ఢిల్లీతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ఐటీ హబ్‌లు, పంజాబ్, మణిపూర్ వంటి సరిహద్దు రాష్ట్రాలు ఈ డ్రగ్స్ మాఫియాకు ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి. యువత ఇంతలా ఈ వ్యసనాల వైపు ఆకర్షితులు కావడానికి వెనుక అనేక సామాజిక, మానసిక, సాంస్కృతిక కారణాలు దాగి ఉన్నాయి. ఆధునిక విద్యా వ్యవస్థలో విపరీతంగా పెరిగిపోయిన పోటీ, మార్కుల కోసం తల్లిదండ్రుల ఒత్తిడి, పరీక్షల భయం, ఉన్నత ఉద్యోగాల సాధనలో ఎదురవుతున్న వైఫల్యాలు యువతలో తీవ్ర మానసిక ఆందోళనకు దారితీస్తున్నాయి. ఈ ఒత్తిడి నుంచి తాత్కాలిక ఉపశమనం కోసం, మానసిక ఒంటరితనాన్ని మరిచిపోవడం కోసం కొందరు ఈ తప్పుడు మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీనికి తోడు 'పీర్ ప్రెషర్' అనబడే స్నేహితుల ఒత్తిడి, సమ వయస్కుల మధ్య తాము తక్కువ అయిపోకూడదనే అహంకారం కూడా ఒక ముఖ్య కారణం. వీటన్నింటికీ మించి, ఆధునిక సమాజంలో వినోద మాధ్యమాల ప్రభావం విపరీతంగా పెరిగింది. చలనచిత్రాలు, పాశ్చాత్య వెబ్ సిరీస్‌లు, సామాజిక మాధ్యమాలలో డ్రగ్స్ తీసుకోవడాన్ని ఒక 'ఫ్యాషన్' గా, ఆధునికతకు ప్రతీకగా, గొప్ప సాహసంగా ఆకర్షణీయంగా చూపించడం వల్ల పసి మనస్సులు తప్పుదోవ పడుతున్నాయి. ప్రారంభంలో కేవలం కుతూహలంతోనో లేదా స్నేహితుల ముందు గొప్పలు చెప్పుకోవడానికో ఒకసారి ప్రయత్నించే సరదా, క్రమంగా మెదడును తన ఆధీనంలోకి తెచ్చుకొని జీవితాంతం వదిలించుకోలేని భయంకరమైన వ్యసనంగా మారిపోతోంది. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు మొదటగా వ్యక్తిగత ఆరోగ్యాన్ని పూర్తిగా ఛిన్నాభిన్నం చేస్తాయి.

డ్రగ్స్ శరీరంలోకి ప్రవేశించగానే కేంద్ర నరాల వ్యవస్థపై, ముఖ్యంగా మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీనివల్ల జ్ఞాపకశక్తి మందగించడం, ఆలోచనా సామర్థ్యం హరించుకుపోవడం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి నష్టాలు వాటిల్లుతాయి. కాలక్రమేణా ఇది తీవ్రమైన మానసిక అస్థిరతకు, లేనివి ఉన్నట్లు ఊహించుకునే భ్రాంతులకు (Hallucinations), ఆందోళన (Anxiety), తీవ్ర నిరాశ (Depression) కు దారితీసి, చివరకు ఆత్మహత్యా ఆలోచనలను రేకెత్తిస్తుంది. శారీరకంగా గుండె, కాలేయం (లివర్), ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి ముఖ్య అవయవాలు క్రమంగా క్షీణిస్తాయి. మోతాదు మించి తీసుకోవడం (Over dose) వల్ల శ్వాస వ్యవస్థ స్తంభించి ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది నడివయస్సులోనే ఆకస్మిక మరణాల బారిన పడుతున్నారు. విద్యా వ్యవస్థపై, విద్యార్థులపై ఈ ప్రభావం మరింత వినాశకరంగా ఉంటోంది. డ్రగ్స్‌కు బానిసైన విద్యార్థి చదువుపై ఏకాగ్రతను పూర్తిగా కోల్పోతాడు. తరగతులకు హాజరు కాకపోవడం, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోవడం, చివరకు చదువును మధ్యలోనే విడిచిపెట్టడం (Dropouts) వంటి పరిణామాలు సంభవిస్తాయి. ప్రవర్తనలో విపరీతమైన మార్పులు వచ్చి, హింసాత్మకంగా మారడం, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుంది. విద్యాసంస్థల్లో ఇటీవల కాలంలో తరచూ బయటపడుతున్న డ్రగ్స్ ముఠాల ఉదంతాలు, విద్యా రంగాన్ని ఈ మహమ్మారి ఎంతలా కబ్జా చేసిందో స్పష్టం చేస్తున్నాయి.

వ్యక్తిగత వినాశనంతో ఆగని ఈ వ్యసనం, ఆ వ్యక్తి ఉన్న కుటుంబ వ్యవస్థను కూడా అగాధంలోకి నెట్టేస్తుంది. డ్రగ్స్ కొనుగోలు చేయడానికి భారీగా డబ్బు అవసరం కావడంతో, విద్యార్థులు లేదా యువకులు ఇంట్లో డబ్బు దొంగిలించడం, అబద్ధాలు చెప్పడం మొదలు పెడతారు. అది చాలనప్పుడు బయట మోసాలకు, చిన్న చిన్న నేరాలకు పాల్పడతారు. దీనివల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి దిగజారడమే కాకుండా, సమాజంలో తల్లిదండ్రులు తలదించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. తమ బిడ్డ భవిష్యత్తు నాశనమవడాన్ని చూస్తూ ఆ తల్లిదండ్రులు అనుభవించే మానసిక వేదన వర్ణనాతీతం. ఒక వ్యక్తి వ్యసనపరుడైతే, ఆ వ్యసనం వెనుక ఒక మొత్తం కుటుంబం నిలువునా దహనమైపోతుందనేది కఠినమైన సాస్త్రీయ సత్యం. అంతేకాకుండా, ఈ మాదక ద్రవ్యాల వ్యాపారానికి, నేర ప్రపంచానికి అవినాభావ సంబంధం ఉంది. ఇది అంతర్జాతీయ మాఫియా ముఠాలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. భౌగోళికంగా భారతదేశం అక్రమ రవాణాకు అత్యంత అనుకూలమైన, ప్రమాదకరమైన ప్రాంతంలో ఉంది. పశ్చిమాన ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ లతో కూడిన

## యువతను మింగుతున్న డ్రగ్స్ భూతం



"గోల్డెన్ క్రెసెంట్" (బంగారు నెలవంక) ప్రాంతం, తూర్పున మయన్మార్, థాయిలాండ్, లావోస్ లతో కూడిన "గోల్డెన్ ట్రయాంగిల్" (బంగారు త్రిభుజం) ప్రాంతాల మధ్య భారత్ విస్తరించి ఉండటం వల్ల, అంతర్జాతీయ స్మగ్లర్లు దేశ సరిహద్దులను సులభంగా వాడుకుంటున్నారు. సరిహద్దుల గుండా దేశంలోకి ప్రవేశించే ఈ విషపదార్థాలు దేశీయ నెట్‌వర్క్ ద్వారా నగరాలు, విద్యాసంస్థలకు చేరుతున్నాయి. ఈ అక్రమ వ్యాపారం ద్వారా ఆర్జించే నల్లధనాన్ని ఉగ్రవాద కార్యకలాపాలకు, దేశ విచ్ఛిన్నకర శక్తులకు (Narco-Terrorism) నిధులుగా మళ్లిస్తున్నట్లు జాతీయ భద్రతా సంస్థలు ఆధారాలతో సహా హెచ్చరిస్తున్నాయి. ఇటీవలి కాలంలో హైదరాబాద్ టాలీవుడ్ డ్రగ్స్ కేసుల నుంచి ముంబై క్రూయిజ్ షిప్ ఉదంతాల వరకు, బెంగళూరు రేవ్ పార్టీల దాకా ఎన్నో సంఘటనలు చట్ట అమలు సంస్థలచే వెలుగులోకి తెచ్చబడ్డాయి. నేడు స్మగ్లర్లు సాంప్రదాయ పద్ధతులను పక్కన బెట్టి, పోలీసులకు దొరకకుండా ఉండేందుకు 'డార్క్ వెబ్' (Dark Web), ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌లు, క్రిప్టోకరెన్సీలను వాడుతూ సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్నారు. ఇది పోలీసు, నార్కోటిక్స్ విభాగాలకు సరికొత్త సవాళ్లను విసురుతోంది.

ఈ మహమ్మారిని అణచివేయడానికి భారతదేశంలో అత్యంత కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయి. 1985 లో తీసుకువచ్చిన 'ఎన్‌డీపీఎస్ చట్టం' (Narcotic Drugs and Psychotropic Substances Act) ప్రకారం డ్రగ్స్ తయారీ, రవాణా, అమ్మకం లేదా వినియోగానికి పాల్పడితే భారీ జరిమానాలతో పాటు జీవిత ఖైదు, కొన్ని అరుదైన సందర్భాలలో మరణశిక్ష విధించే అవకాశం కూడా ఉంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (NCB), రాష్ట్రాల ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కస్టమ్స్ విభాగాలు నిరంతరం దాడులు చేస్తూ కోట్లాది రూపాయల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటున్నాయి. అయినప్పటికీ, కేవలం చట్టాలు, పోలీసుల లాఠీలతో మాత్రమే ఈ సామాజిక రుగ్మతను పూర్తిగా నిర్మూలించలేము. దీనికి సమగ్రమైన సామాజిక మార్పు, సమిష్టి బాధ్యత అత్యంత అవసరం.

ఈ పోరాటంలో ప్రథమ రక్షణ కవచం తల్లిదండ్రులే. వారు తమ పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపాలి. పిల్లల ప్రవర్తనలో వచ్చే ఆకస్మిక మార్పులను (ఒంటరిగా ఉండటం, ఆకలి మందగించడం, ఎక్కువ డబ్బులు అడగడం, విపరీతమైన కోపం) నిశితంగా గమనించాలి. వారితో స్నేహపూర్వకంగా ఉంటూ, వారి మానసిక ఒత్తిడిని పంచుకోవాలి. వారి స్నేహితులెవరు, వారి ఆన్‌లైన్ వ్యాపకాలు ఏమిటనే దానిపై నిరంతర నిఘా ఉంచాలి. అలాగే విద్యాసంస్థల పాత్ర కూడా తక్కువేమీ కాదు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు క్రమబద్ధమైన కౌన్సెలింగ్ అందించాలి. కళాశాలల్లో డ్రగ్స్ రహిత కమిటీలను ఏర్పాటు చేసి విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలి. యువత తమ అపారమైన శక్తిని, సృజనాత్మకతను తప్పుడు మార్గాల్లో కాకుండా క్రీడలు, యోగా, ధ్యానం, సంగీతం, సాహిత్యం వంటి ఉత్పాదక రంగాల వైపు మళ్లించేలా ప్రోత్సహించాలి.

యువత తాత్కాలిక భ్రాంతిని కలిగించే సుఖాల కోసం తమ అమూల్యమైన జీవితాలను, దేశ భవిష్యత్తును పణంగా పెట్టకూడదు. సమస్యలు ఎదురైనప్పుడు పారిపోకుండా, వ్యసనాల బారిన పడకుండా, ధైర్యంగా నిలబడి కుటుంబ సభ్యుల లేదా మానసిక నిపుణుల సహాయం తీసుకోవాలి. యువత దేశానికి శాశ్వత సంపద. వారి మేధస్సు, శ్రమ దేశ పురోగతికి ఇంధనం. అటువంటి యువశక్తిని మాదక ద్రవ్యాలనే భూతం మింగేయకుండా కాపాడుకోవడం కేవలం ప్రభుత్వానిదే కాదు; ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు, సామాజిక సంస్థ, ప్రసార మాధ్యమాలు మరియు బాధ్యతాయుత పౌరుడి ప్రథమ కర్తవ్యం. సమాజమంతా సమిష్టిగా కదిలి, కఠిన చట్టాల అమలుతో పాటు మానవీయ కోణంలో అవగాహన కల్పించినప్పుడే మనం 'డ్రగ్స్ రహిత సమాజాన్ని' నిర్మించగలం. యువతను రక్షించుకోవడం అంటే మన దేశ అస్థిత్వాన్ని, భవిష్యత్తును రక్షించుకోవడమే.



సంగనబట్ల
9440595494

# సాహిత్యం - సమాజం


సాహిత్యం మానవ కార్యకలాపాలు అతి ప్రాచీన రూపం. కళాకారుడు, శ్రామికుడు, శాస్త్రజ్ఞుడు ఈ ముగ్గురు సంస్కృతి నిర్మాతలని మాక్సిమ్ గోర్కి గారు అభిప్రాయపడ్డారు. మనిషి తన శ్రమ ద్వారా సంస్కృతి నిర్మించుకుంటూ వస్తున్నాడు. అందులో భాగమే సాహిత్యం. రచయిత సమాజంతో చేసే సంభాషణ సాహిత్యం. రచయితకు అర్థమైన సమాజానికి అక్షర రూపం సాహిత్యం. రచయిత తనను తాను ప్రపంచానికి తెలియపరచుకోవడమే సాహిత్యం.

**సాహిత్యం సామాజిక జీవితం ప్రతిబింబం**

మనిషి సమిష్టిగా చేసే సమాజ నిర్మాణ చరిత్ర సాహిత్యంలో కళాత్మకంగా ప్రతిబింబిస్తుంది. సమాజ జీవితంలోని మానవ సంబంధాలు సృజనాత్మకంగా సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. సమాజ జీవితానికి, రచనకు మధ్య రచయిత ఉంటాడు. రచయితకు ఒక వ్యక్తిత్వం ఉంటుంది, తన సమాజంతో అతనికి సామరస్యం మరియు వైరస్యము రెండూ ఉంటాయి. సమాజంలోని కుల, మత, వర్గ ,ప్రాంతాది బేధాలు రచయితకు ఉంటాయి.. అవి రచయిత మీద ప్రభావం చూపుతాయి. అలగే అతని ఆలోచనల మీద సామాజిక వైరుధ్యాల మీద ప్రభావం ఉంటుంది. ఆ ప్రభావాల్లోంచి రచయిత సమాజాన్ని దర్శిస్తాడు. వాటి ప్రభావంతో రచయిత తన సమాజ పరిణామాలను కొన్నిటిని ఇష్టపడతాడు, మరికొన్నిటిని వ్యతిరేకిస్తాడు. పైగా అతనికంటూ ఒక సౌందర్య దృష్టి ఉంటుంది. ఆ నేపథ్యంలో నుంచి రచయిత రచన చేస్తాడు. కాబట్టి, సమాజం అతని సాహిత్యంలో తను అనుకున్నట్టుగా, అతను కోరుకున్నట్టుగా ప్రతిబింబిస్తుంది. అందుకే సాహిత్యం సామాజిక జీవితానికి విమర్శనాత్మక, సృజనాత్మక ప్రతిబింబం అవుతుంది.

**సమాజం - సాహిత్యం లో నిరంతర మార్పు**

ప్రకృతి నిరంతరం మార్పుకు లోనవుతూ ఉంటుంది. ప్రకృతిలో భాగమైన మానవ సమాజం కూడా నిరంతరం మారుతూనే ఉంటుంది. సమాజంలో మార్పు వచ్చినప్పుడల్లా సాహిత్యంలో మార్పులు వస్తాయి. అంటే రాచరిక వ్యవస్థలో రాజరికాన్ని ప్రతిబింబించే సాహిత్యం వస్తే, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని ప్రతిబింబించే, ప్రజల సమస్యలను చిత్రించే సాహిత్యం వస్తుంది. రాచరిక వ్యవస్థలో భారతం, రామాయణం వంటి రాజులకు సంబంధించిన కావ్యాలు వస్తే, ఆధునిక వ్యవస్థలో కన్యాశుల్కం, మాలపల్లి వంటి సమకాలీన సమాజంలోని అసమానతలు, ప్రజా సమస్యలు గల రచనలు రావడానికి కారణం ఇదే. ఆధునిక కాలంలో భారత, రామాయణాలు వచ్చినా అది వ్యాస, వాల్మీకుల రచనలలాగే ఉండవు, కొన్ని అయినా అంతర్గత మార్పులతో వర్తమాన సమాజ విషయాల జోడింపుతో వస్తాయి. కాబట్టి సాహిత్యంలో మార్పులు రావడానికి ఈ సమాజంలో వచ్చిన మార్పులే కారణం అవుతాయి.



**సామాజిక మార్పు మేరకే సాహిత్యంలో మార్పు**

సమాజంలో ఏ మేరకు మార్పులు వస్తాయో సాహిత్యంలో కూడా అదే స్థాయిలో మార్పులు వస్తాయి. విభిన్న కాలాల్లో వచ్చిన రచనలను సామాజిక పరిణామ దృష్టితో పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది. ప్రాచీన సాహిత్యంలో భారతంలో శుభలుడు గాంధారి పెళ్లి విషయంలో అతని భార్యనుగానీ కూతురినిగానీ సంప్రదించకుండానే నిర్ణయం తీసుకున్నాడు. అప్పుడు ఎవరు ప్రశ్నించలేదు. అది భూస్వామ్య వ్యవస్థ లక్షణం. ఆధునిక సాహిత్యంలో కన్యాశుల్కం నాటకంలో సుబ్బితల్లి వెంకమ్మ తన కూతురు పెళ్లి విషయంలో భర్తను ప్రశ్నించింది. ఇక్కడ తల్లికి ప్రశ్నించే హక్కు వచ్చింది. వెంకమ్మ ప్రశ్నించినా అగ్నిహోత్రావధాన్లు దబాయించి ఆమె నోరు మూయించాడు. కొత్త చూపు కథలో పెళ్లి చేసుకునే అమ్మాయి అన్నపూర్ణ తనకు తానే పెద్దరికం తీసుకొని స్త్రీ వివాహం విషయంలో పురుషాధిపత్యాన్ని నిలదీసింది, తిరస్కరించింది. భారత రచనా కాలంనాటికి, కన్యాశుల్కం రచనా కాలంనాటికి కొత్తాచూపు కథ కాలంనాటికి సమాజంలో వచ్చిన మార్పులు ఆయా రచనలలో స్పష్టంగా తెలుస్తున్నాయి.

స్వతంత్ర భారతదేశంలో స్త్రీకి ఎలాంటి హక్కులు రావాలని రచయిత కోరుకున్నాడో అలాంటి హక్కుల కోసం సాహిత్యపరంగా ఉద్యమించడం జరుగుతుంది. ఆ ఉద్యమంలో భాగంగానే అసలు వివాహం స్త్రీ సమస్యకు పరిష్కారం కాదని స్త్రీవాదం ప్రతిపాదించింది. ఈ రకంగా సమాజపు ఆలోచనలోగానీ, ఆచరణలోగానీ వస్తున్న మార్పులు ఏ మేరకు వస్తే ఆ మేరకే సాహిత్యం ప్రతిబింబంగా నిలుస్తుంది అని అర్థమవుతుంది.

**సమాజం కన్నా రచయిత చైతన్యం ఒక ముందడుగు:** రచయిత చైతన్యం ప్రగతిశీలమైనదైతే అతను సమాజం కన్నా ముందుంటాడు. వర్తమాన సమాజాన్ని విమర్శించి సరికొత్త సమాజాన్ని ప్రత్యామ్నాయ సమాజంగా ప్రతిబింబిస్తే, సమాజం కన్నా సాహిత్యం ముందు ఉన్నట్టు అలాగే రచయిత తాను తీసుకున్న సమస్యలకు పరిష్కారం చూపడంలో కూడా సమాజం కన్నా తాను ముందున్నట్లు రుజువు చేసుకోవచ్చు. ఒక రచనలో ప్రారంభదశలో ఒక పాత్ర కనిపించే తీరు ఒకరకంగా ఉంటుంది, ఆ రచన పూర్తయ్యేలోపు ఆ పాత్ర మరోరకంగా పరిణమిస్తుంది. ఆ పాత్ర మొదటి దశ వర్తమాన సమాజం అయితే, చివరి దశ రచయిత కోరుకునే ప్రత్యామ్నాయ సమాజం అవుతుంది. అది రచయిత సమాజం కన్నా ముందుండే స్థితిని తెలుపుతుంది. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రాసిన అరికాళ్ళ కింద మంటలు కథలో రుక్కమ్మ అనే బాలవితంతువుతో పుట్టింట్లోని వారు వెట్టి చాకిరి చేయించుకుంటారు. ఎవరు ఏ పని చెప్తే ఆ పని చేయడం తప్ప ఆమెకంటూ ఒక జీవితం లేదు. ఇది సమకాలీన బాలవితంతు వ్యవస్థలోని వర్తమానత. దీనిపట్ల రచయితకు అసంతృప్తి ఉంది. వితంతువులు జీతం లేని పని మనుషుల్లాగా మిగిలిపోవడం ఆయనకు ఇష్టం లేదు. అలాంటి సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలి అనుకున్నాడు. అందుకే రుక్కమ్మను అర్ధరాత్రి పూట జట్కా ఎక్కించి పంతులు గారి తోటకు పంపించాడు పునర్వివాహం చేసుకోవడానికి. రచయిత సమాజం కన్నా ముందు ఉండడం అటే ఇదే. అలాగే కన్యాశుల్కం కాలం నాటికి స్త్రీ పరిస్థితి దుర్భరంగానే వుంది అది గురజాడ అప్పారావుగారికి నచ్చలేదు. కాబట్టే ఆయన ఆడవాళ్లు ఒకరి మీద ఆధారపడే స్థితి నుండి స్వతంత్ర జీవనం గడిపే స్త్రీగా పూటకుళ్ళమ్మను చూపించారు. బాల్య వివాహాలు నచ్చక సుబ్బిపెళ్లి ఆపాడు. అదేవిధంగా వితంతు పునర్వివాహం జరగాలని ఆశించి బుచ్చమ్మను ఇంటినుండి బయటకు పంపాడు. కన్యక కవితలో రాజును ఎదిరించే ధైర్యం కన్యకను ఇవ్వడం. ఇవన్నీ రచయిత తనున్న సమాజం కంటే ముందుండే స్థితిని తెలుపుతుంది.

**సమకాలీన సమాజం సాహిత్య సమర్థన**.. వర్తమాన సమాజం పట్ల రచయితకు తృప్తిగానీ అసంతృప్తిగానీ ఉంటాయి. తృప్తి కలిగిన రచయిత సమాజాన్ని సమర్థిస్తాడు. అసంతృప్తి కలిగిన రచయిత దాన్ని విమర్శిస్తాడు. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబించడంలో ఇదొక ముఖ్యమైన విషయం. నన్నయ్య వర్ణ వ్యవస్థను నోరారా కీర్తించాడు. పాలకుర్తి సోమనాథుడు వ్యతిరేకించాడు. మన ఇతిహాసాలలో రాజుల యుద్ధాలను మన కవులు ఆవేశంతో రకరకాలుగా వర్ణించారు. కానీ అన్నమయ్య రాజ్యాధికారం కోసం రక్త సంబంధికులు ఒకరినొకరు చంపుకోవడాన్ని విమర్శించాడు. స్వతంత్రోద్యమ కాలంలో మాకొద్దీ తెల్లదొరతనం అని గరిమెళ్ళ సత్యనారాయణ పాడితే, కుసుమధర్మన మాకొద్దీ నల్లదొరతనం అని పాడారు.

**సాహిత్య తత్వం భావ ప్రచారం:** సాహిత్యం సమాజం నుంచి భావాలను, వస్తువులను స్వీకరించి రచన రూపంలో తిరిగి సమాజానికి అంకితం చేస్తుంది. సాహిత్యంలోకి రాకముందు వస్తువు వస్తువుగానే ఉంటుంది. కానీ చెక్కిన తర్వాత శిల శిల్పమైనట్టు వస్తువు సాహిత్యంలోకి ప్రవేశించి రచనగా, కళగా రూపొందుతుంది. ఒక భావం సమాజంలో నుంచి రచనలోకి వచ్చి కళాత్మక భావంగా మారి తిరిగి సమాజంలోకి వెళుతుంది, సమాజంలో ప్రచారం అవుతుంది. సమాజంలోకి వెళ్ళి మనుషుల్ని నిద్ర లేపుతుంది. మనుషుల్లో కదలిక తెస్తుంది. మనిషిని జ్ఞానిని చేస్తుంది. మామూలు మనిషిని అద్భుత మానవునిగా తీర్చిదిద్దుతుంది. బాధ్యతాయుతంగా చేయబడిన రచన సమాజాన్ని ఒక్కడుగన్నా ముందుకు వేయిస్తుంది. సామాజిక రోగాలకు రచన సాహితీ వైద్యం అవుతుంది. సాహిత్యం నీటి కణంలో నిప్పు పుట్టించగలదు. ఇది రచయిత చైతన్యాన్ని బట్టి ఉంటుంది. సాహిత్యం రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. అది సమాజాన్ని నిద్ర లేపగలదు, నిద్రపుచ్చగలదు.

**ముగింపు :** సాహిత్యం అనేది కేవలం అక్షరాల కూర్పు కాదు, అది సమాజపు అంతరాత్మ. సమాజంలో వచ్చే మార్పులను ప్రతిబింబించడమే కాకుండా, సమాజం కంటే ఒక అడుగు ముందుండి నూతన చైతన్యాన్ని, మార్గదర్శకత్వాన్ని అందించే అద్భుతమైన సాధనం సాహిత్యం. కాలం మారుతున్న కొద్దీ సామాజిక విలువలు, వ్యవస్థలు మారవచ్చు, కానీ సమాజ హితాన్ని కోరే సాహిత్య ప్రయోజనం మాత్రం ఎప్పటికీ మారదు. ఒక బాధ్యతాయుతమైన రచయిత తన కలం ద్వారా సమాజంలోని రుగ్మతలను నయం చేసే వైద్యుడిగా, రేపటి ప్రగతికి బాటలు వేసే దార్శనికుడిగా నిలుస్తాడు. అందుకే, నిరంతరం పరిణామం చెందే సమాజ ప్రయాణంలో సాహిత్యం ఎప్పటికీ ఒక దిక్సూచిలా వెలుగుతూనే ఉంటుంది.

ఉపయుక్త గ్రంథ సూచి :
1. తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటి – జి. నాగయ్య
2. తెలుగు సాహిత్య విమర్శ – ఎస్. వి. రామారావు



ఆవుల రేణుక
9398268976

## సానుభూతి వద్దు.. సమాన గౌరవం ముద్దు

భర్త మరణిస్తే భార్య నుదుట
ఉన్న బొట్టు పోతేనేమి
ఆమె గుండెల్లో ఆశలు
చచ్చిపోవు కదా?

చేతికున్న గాజులు
పగిలిపోతే నేమి
మనుషులపై మమకారం
చెరిగిపోదుకదా?
భర్తను కోల్పోవడం
ఆమె తప్పు కాదు

లోకం ఆమెను
పాపాత్మురాలిగా
చూడడం అన్యాయం

కట్టుకున్న వాడు
కానరాని లోకాలకు పోతే

కన్నవారే ఆమెను దూరం
పెట్టడం ధర్మమా?

పండుగ వస్తె చాలు
ఆమెను గదిలో దాచేస్తారు
శుభకార్యం జరిగితే
ఆమె నీడను పడనీయరు

నలుగురిలోకి వస్తే
అపశఖనం అంటూ
నిందిస్తారు
సమాజం కళ్ళు ఆమెను
నిలువునా ధహించేస్తాయి

రంగు రంగుల

హైటెక్ యుగంలో
(ఎ ఐ యుగంలో)
ఆమెకు తెల్లని చీర శిక్షా?
నవ్వడం కూడా నేరంగా
భావించే సమాజ
వాతావరణం ఉంది

ఆమె కన్నీళ్లు ఎవరికి
శాపాలు కావు సమాజ
చూపులే అమెకు
నిత్య గాయాలు

ఆమె కూడా ఒక అమ్మే కదా
ఒక కూతురే కదా
మనలాగే రక్త మాంసం

ఉన్న మనిషే కదా
మనసు ఉన్న మనిషే కదా

ఆమె నవ్వులో ఎందుకంత
వివక్ష
ఆమె ఒంటరి తనానికి
ఎందుకీ సామాజిక శిక్ష
చదువుకుంది ఆమె
సంపాదించగలదు ఆమె
ఈ దేశాన్ని మార్చే శక్తి
కూడా ఉంది ఆమెకు

కానిమూఢ నమ్మకాల కట్టుబాట్ల
మధ్య ఆమె బతుకు ఒక
ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది

ఇకనైనా మారుద్దాం మన సంకుచిత
ఆలోచనలను తెంచుకుందాం
ఆ పాత కాలపు మూఢ
సంకెళ్ల నుండి విముక్తి
కల్పిద్దాం
ఆమె జీవితంలో మళ్లీ
రంగులను నింపుదాం

కొత్త ఆశలతో ఆమెను
ముందుకు నడిపిద్దాం
ఆమెకు స్వేచ్ఛ వుంది
స్వేచ్ఛగాబతికే హక్కుఉంది
ఆమెకు కావాలి
సమాజంలో సమాన
గౌరవం
ఆమెను కూడా మనలో
ఒకరిగా ఆదరిద్దాం

మానవత్వంతో
కొత్తలోకాన్ని నిర్మిద్దాం
సమాజంవితంతువులకు
సామాజిక గౌరవంన్యాయం
విద్య ఆర్థిక భద్రత కల్పించాలి

వితంతువుల ఆర్థిక
స్వావలంబనకు సామాజిక
మద్దతునిచ్చి దేశాభివృద్ధిలో
భాగస్వాములను చేద్దాం
ఆమె నుదుట ధైర్యమనే
బొట్టుపెట్టిముందుకు
సాగేలా
ప్రోత్సాహిద్దాం

వితంతువు అనేది ఒక
శాపం కాదు

అది కేవలం ఒక పరిస్థితి మాత్రమే
బొట్టు గాజులు రంగు చీరలు
మనిషిజీవితాన్ని శాసించే లేవు
సాంప్రదాయాల పేరుతో ఒక
మహిళను మానసికంగా
చంపడం అమానుషం
సమాజం మారాలి ప్రతి
మహిళ ఆత్మ గౌరవంతో
బతికే సమానహక్కును
అందించాలి
మార్పు మన ఇంటి
నుంచే మొదలు కావాలి



నేదునూరి
కనకయ్య
9440245771

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



# జాతీయం-అంతర్జాతీయం





## హాట్‌హాట్‌గా తమిళనాడు అసెంబ్లీ

- సీఎం విజయ్.. డీఎంకే సభ్యుల మధ్య వాగ్యుద్ధం
- వాకౌట్ చేసిన ప్రతిపక్ష సభ్యులు

**చెన్నై, జూన్ ,23(ఎ.ఎం.ఎస్)**

తమిళనాడు శాసనసభ మంగళవారం నాటి సమావేశాల్లో తీవ్ర వాదోపవాదాలు, నాటకీయ పరిణామాల మధ్య అట్టుడికింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష డీఎంకే మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, డీఎంకే పార్టీ పేరుతో అక్రమంగా నిధులు సేకరిస్తోందని ఆరోపించడంతో పాటు, అవినీతికి పాల్పడిన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనల్లో వాస్తవం లేదని, అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన విమర్శించారు. విజయ్ ప్రసంగానికి డీఎంకే సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ, డీఎంకే సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

## ఉద్రిక్తంగా పీవోకే

- ఆందోళనలోకి మహిళలు, విద్యార్థులు
- పాక్ సైనిక ఆధిపత్యంపై నిరసనలు

**ఇస్లామాబాద్, న్యూఢిల్లీ, జూన్ 23ః**

***పాకిస్థాన్ ఆక్రమణకు స్వస్తి పలకాలని, తమకు స్వాతంత్ర్యం కావాలని కోరుతూ గత రెండు వారాలుగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో కొనసాగుతోన్న ఆందోళనల్లోకి సోమవారం మహిళలు, పాఠశాల విద్యార్థులు భారీ ఎత్తున చేరడంతో మలుపు తీసుకుంది. నిరసనలకు ప్రధాన కేంద్రంగా ఉన్న రావల్‌కోట్ ఈద్గా మైదానంలో గత 11 రోజులుగా 70 వేల మందికిపైగా నిరసనలు కొనసాగిస్తున్నారు. సోమవారం 'పాకిస్థాన్ ఆర్మీ గో బ్యాక్', 'కశ్మీరీలను పాక్ సైన్యం చంపుతోంది', 'పాకిస్థాన్ దాడిలో కశ్మీర్ నలిగిపోతోంది', 'మాకు ప్రాథమిక హక్కులు కావాలి', 'మేము ఉచిత విద్య కోరుకుంటున్నాం', 'ఆహారాన్ని ఆపేశారు.. ఇంటర్నెట్ నిలిపివేశారు', 'ఐక్యరాజ్యసమితి మా సమస్యలపై దృష్టి పెట్టండి' అనే నినాదాలు రాసిన ప్లకార్డులను పదులు సంఖ్యలో స్కూల్ చిన్నారులు ప్రదర్శించారు. 10 నుంచి 12 ఏళ్ల మధ్య వయస్సున్న పిల్లలు బహిరంగంగా స్వేచ్ఛా నినాదాలు చేయడం అనేది కొనసాగుతున్న ఆందోళనల్లో అత్యంత ముఖ్యమైన అంశం.***

పాకిస్థాన్ ఆక్రమణకు స్వస్తి పలకాలని, తమకు స్వాతంత్ర్యం కావాలని కోరుతూ గత రెండు వారాలుగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో కొనసాగుతోన్న ఆందోళనల్లోకి సోమవారం మహిళలు, పాఠశాల విద్యార్థులు భారీ ఎత్తున చేరడంతో మలుపు తీసుకుంది. నిరసనలకు ప్రధాన కేంద్రంగా ఉన్న రావల్‌కోట్ ఈద్గా మైదానంలో గత 11 రోజులుగా 70 వేల మందికి పైగా నిరసనలు కొనసాగిస్తున్నారు. సోమవారం 'పాకిస్థాన్ ఆర్మీ గో బ్యాక్', 'కశ్మీరీలను పాక్ సైన్యం చంపుతోంది', 'పాకిస్థాన్ దాడిలో కశ్మీర్ నలిగిపోతోంది', 'మాకు ప్రాథమిక హక్కులు కావాలి', 'మేము ఉచిత విద్య కోరుకుంటున్నాం', 'ఆహారాన్ని ఆపేశారు.. ఇంటర్నెట్ నిలిపివేశారు', 'ఐక్యరాజ్యసమితి మా సమస్యలపై దృష్టి పెట్టండి' అనే నినాదాలు రాసిన ప్లకార్డులను పదులు సంఖ్యలో స్కూల్ చిన్నారులు ప్రదర్శించారు. 10 నుంచి 12 ఏళ్ల మధ్య వయస్సున్న పిల్లలు బహిరంగంగా స్వేచ్ఛా నినాదాలు చేయడం అనేది కొనసాగుతున్న ఆందోళనల్లో అత్యంత ముఖ్యమైన అంశం. ఇది ఆ ప్రాంతంలోని పెరుగుతున్న రాజకీయ అణచివేత, ఆర్థిక ఇబ్బందులు, సైనిక ఆధిపత్యంపై ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఇన్నాళ్లు రావల్‌కోట్‌కే పరిమితమైన నిరసనలు అనేక పట్టణాలు, గ్రామాలకు వ్యాపించాయి.



సుధ్నోటి జిల్లాలోని తారర్ ఖేల్‌లో పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య నినాదాలు చేస్తూ ఒక బహిరంగ ప్రదేశంలో గుమిగూడారు. మంధోల్‌లో వందలాది మంది మహిళలు పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యాన్ని ఆక్రమణలనుగా ఖండిస్తూ స్వేచ్ఛ కోసం నినాదాలు చేశారు.



## అదంతా అమెరికా మీడియా షో..

- అందుకే గ్రూప్ ఫొటో వద్దు
- బహిష్కరించిన ఇరాన్

**స్విట్జర్లాండ్, జూన్ 23ః**

అమెరికాఇరాన్ యుద్ధానికి సంబంధించి తుది ఒప్పందంపై ఉద్రిక్తతల నడుమ చర్చలు మొదలయ్యాయి. ముఖ్యంగా చర్చల అనంతరం గ్రూప్ ఫొటోను ఇరాన్ బహిష్కరించింది. అమెరికా ప్రతినిధులతో కలిసి ఫొటో దిగేందుకు ఇరాన్ నేతలు నిరాకరించారు. అదంతా 'అమెరికా మీడియా షో' అని ఎద్దేవా చేశారు. అయితే ఆ తర్వాత 80 నిమిషాల పాటు చర్చలు కొనసాగాయని ఇరాన్ అధికారులు చెప్పారు. అయితే ట్రంప్ బెదిరింపులపై ఇరాన్ వైపు నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. నోరు అదుపులో ఉంచుకొని మాట్లాడితే మంచిదని ఇరాన్ చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఖలీబఫ్ చురక వేశారు. తగిన విధంగా స్పందించేందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని అంటూ 'వారు మాటలు చెబుతూనే ఉంటారు... మేము చేతలలో చూపుతాం' అని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు నిరసన తెలుపుతూ ఇరాన్ ప్రతినిధులు కొద్దిసేపు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో మాట్లాడిన అనంతరం అబ్బాస్ అరాగ్చీ తన సహచర ప్రతినిధులతో కలిసి బయటికి వెళ్లిపోయారు. ఇరాన్ ప్రతినిధుల చర్యకు షరీఫ్ నివ్వెరపోయారు. అదంతా 'అమెరికా మీడియా షో' అని ఎద్దేవా చేశారు. అయితే ఆ తర్వాత 80 నిమిషాల పాటు చర్చలు కొనసాగాయని ఇరాన్ అధికారులు చెప్పారు. అయితే ట్రంప్ బెదిరింపులపై ఇరాన్ వైపు నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. అయితే చర్చలు ప్రారంభం కావడానికి ముందు ఏర్పాటు చేసిన పశ్చిమ దేశాల పాత్రికేయుల సమావేశానికి కూడా ఇరాన్ ప్రతినిధులు హాజరు కాలేదు. చర్చల ప్రారంభానికి ముందే ఉద్రిక్త వాతావరణం కన్పించిందని ఇరాన్ మీడియా తెలిపింది.

## బెంగాల్‌లో మైనార్టీలపై ఆగని దాడులు

- మతమార్పిడులంటూ ఆరోపణలు
- బర్ధమాన్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలు

**కలకత్తా, జూన్ ,23(ఎ.ఎం.ఎస్)**

బిజెపి ప్రభుత్వ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన అనంతరం మైనార్టీలపై దాడులు, వేదింపులు పెరిగాయి. తాజాగా పశ్చిమ బర్ధమాన్ జిల్లా రాణిగంజ్‌లో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒక క్రైస్తవ ప్రార్థనా సమావేశంపై విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) సభ్యులు దాడికి పాల్పడ్డారు. మహిళలను ప్రలోభపెడుతున్నారని, బలవంతంగా మత మార్పిడి చేస్తున్నారంటూ ఆరోపిస్తూ ప్రార్థనలు చేసుకుంటున్న విశ్వాసులపై మూక దాడికి పాల్పడ్డారు. ఆదివారం రాణిగంజ్‌లో క్రైస్తవ ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈ సమయంలో విహెచ్‌పి , బజరంగ్ దళ్ కార్యకర్తలు ఒక్కసారిగా చొరబడ్డారు. ప్రార్థన చేస్తున్న వారి నుంచి బైబిళ్లను లాక్కుని, అక్కడ ఉన్న వారిపై దాడికి దిగారు. ''ఈ బైబిల్ సహాయంతో మా మతం మహిళలను ప్రలోభపెట్టి క్రైస్తవ మతంలోకి మారుస్తున్నారు. ఇలాంటి చర్యలను విహెచ్‌పి, బజరంగ్ దళ్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవు'' అని దాడి చేశారు. ఈ క్రమంలో వారు పెద్ద పెట్టున మతపరమైన నినాదాలు చేశారు. అయితే ఈ ఘటన జరిగిన సమయంలో పోలీసు అధికారులు కూడా అక్కడే ఉండటం గమనార్హం. అక్కడ ఉన్న మహిళలు తాము ఎవరి ఒత్తిడి లేకుండా, తమ స్వచ్ఛంద నిర్ణయంతోనే మతం మారామని, ఇందులో ఎటువంటి మోసం లేదని పోలీసులకు మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ, దాడి చేసిన వారు వారిని బెదిరించారు. సుమారు 25 మందిని బలవంతంగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే, ఈ ఘటనపై పశ్చిమ బర్ధమాన్ పోలీసులు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. అయితే పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం మతమార్పిడి నిరోధక చట్టం అమలులో లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించి భారతీయ జనతా పార్టీ (బిజెపి) అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువంటి ఘటనలు వరుసగా చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనను ప్రముఖ జర్నలిస్ట్ అర్ఫా ఖానుమ్ షేర్వానీ తీవ్రంగా ఖండించారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసుల విధులను మతోన్మాద, జాతీయవాద కార్యకర్తలు తమ చేతుల్లోకి తీసుకోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.



దేశంలో మైనారిటీల భద్రతపై ఆమె ప్రశ్నలు . సామాజిక మాధ్యమాల్లో ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో, మత స్వేచ్ఛ, చట్టవిరుద్ధమైన జోక్యంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను కాపాడాలని ప్రతిపక్ష నేతలు, మానవ హక్కుల కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

## బ్రిటన్ ప్రధాని రేసులో బర్న్‌హామ్..

- ఆయనకు 300 మంది ఎంపీల మద్దతు
- ఇటీవల ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపు


**లండన్, జూన్ 23ః**

గత పదేళ్లుగా రాజకీయ అస్థిరతతో సతమతమవుతోన్న బ్రిటన్‌లో మరోసారి అధికార మార్పిడి జరగబోతోంది. ప్రధాని పదవి నుంచి కీర్ స్టార్మర్ వైదొలగడంతో మళ్లీ నాయకత్వ సంక్షోభం ఎదురైంది. ఈ నేపథ్యంలో తదుపరి యూకే ప్రధాని పగ్గాలు ఎవరు చేపడతారనేది ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ రేసులో లేబర్ పార్టీలో 'కింగ్ ఆఫ్ ది నార్త్'గా గుర్తింపు పొందిన ఆండీ బర్న్‌హామ్ ముందున్నారు. ఆయనకే పార్టీలో 300 మంది ఎంపీలు మద్దతు తెలుపుతున్నట్టు ది గార్డియన్ నివేదించింది. మాంచెస్టర్ మాజీ మేయర్ అయిన ఆండీ బర్న్‌హామ్ సుదీర్ఘకాలం తర్వాత యూకే పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మేకర్‌ఫీల్డ్ ఉప ఎన్నికల్లో పోటీచేసి భారీ మెజార్టీతో గెలిచిన ఆండీ.. ప్రధాని పదవికి మార్గం సుగమం చేసుకున్నారు. 2024 బ్రిటన్ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించి, అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ పార్టీకి నాయకత్వం వహించే వ్యక్తి యూకేకు ప్రధానిగా వ్యవహరిస్తారు. అధికారి పార్టీలో స్టార్మర్‌కు బర్న్‌హామ్‌ను ప్రధాన ప్రత్యర్థిగా పేర్కొంటారు.



ఇటీవల ఆండీ మాట్లాడుతూ..''నాపై ప్రజలు నమ్మకం పెడితే నేను రాజకీయాలను మార్చేస్తా'' అంటూ తన రాజకీయ ఆకాంక్షను బయటపెట్టారు. వాయువ్య ఇంగ్లాండ్‌లోని మెర్సీసైడ్‌లో ఆండీ ముర్రే బర్న్‌హామ్ 1970లో జన్మించారు. రాజకీయాలపై ఆసక్తితో లేబర్ పార్టీలో చేరిన ఆండీ.. 2001 నుంచి 2017 వరకు ఎంపీగా ఉన్నారు. మాజీ ప్రధాని గార్డన్ బ్రౌన్ క్యాబినెట్‌లో ట్రెజరీ, కల్చరల్, ఆరోగ్య శాఖలను నిర్వహించారు. పార్టీలో నాయకత్వ పగ్గాలు కోసం గతంలో 2015, 2017లో ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో ప్రధాని కావాలన్న ప్రయత్నాలకు తాత్కాలికంగా విరామం ఇచ్చి... 2017లో మాంచెస్టర్‌కు మేయర్‌గా ఎన్నికయ్యారు. అక్కడ ఆయన రాజకీయ కెరీర్ కీలక మలుపు తిరిగింది. కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో అప్పటి ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రభుత్వంపై బహిరంగంగానే విమర్శలకు దిగారు. లాక్‌డౌన్ వల్ల ప్రభావితమైన నార్త్ ఇంగ్లాండ్‌కు ఆర్థిక సాయం అందించడంలో కన్జర్వేటివ్ ప్రభుత్వం విఫలమైందని అప్పట్లో ఆరోపించారు. అంతేకాదు, నిధుల కేటాయింపుల్లోనూ బోరిస్ సర్కారు వివక్ష చూపిందని దుయ్యబట్టారు. దీంతో ఆండీ పేరు మీడియా, సోషల్ మీడియాలో మార్మోగిపోయి.. ఆయన పాపులారిటీ పెరిగిపోయింది. అందుకే ఆండీ మద్దతుదారులు ఆయనను 'కింగ్ ఆఫ్ ది నార్త్'అని పిలుచుకుంటారు. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' సిరీస్ రిఫరెన్స్‌తో ఆయనకు ఈ పేరు పెట్టారు. ఈ సిరీస్‌లోనూ నార్త్ రీజియన్ నేతలు తరచూ రాజు పాలనను ఎత్తిచూపుతారు. మాంచెస్టర్ మేయర్‌గా ఆండీ అందించిన సేవలకు మంచి గుర్తింపు లభించింది.

ప్రజా రవాణాను మెరుగుపర్చడం, ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం చేపట్టం, అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణాలు వంటి చర్యలు జాతీయ మీడియాను ఆకర్షించాయి. అదే పాపులారిటీతో పార్లమెంట్‌లోకి ఆండీ మళ్లీ అడుగుపెట్టగలిగారు. ఈ క్రమంలోనే స్టార్మర్ రాజీనామాతో నాయకత్వ పగ్గాల కోసం పోటీ పడేందుకు సిద్ధమైనట్లు సమాచారం.



## ముగిసిన రాజ్యసభ పదవీకాలం

- కేంద్ర మంత్రి కురియన్ రాజీనామా

**న్యూఢిల్లీ, జూన్ 23(ఎ.ఎం.ఎస్):**

***కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ సభ్యత్వ పదవీ కాలం ముగియడం, ఈసారి బీజేపీ అధిష్ఠానం ఆయనను తిరిగి నామినేట్ చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జార్జి కురియన్ సమర్పించిన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఇప్పటివరకు మోడీ క్యాబినెట్‌లో ఆయన మైనార్టీ వ్యవహారాల శాఖతో పాటు.. నిర్వహించారు. ఆదివారం అంటే జూన్ 21న ముగిసింది.***

కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ సభ్యత్వ పదవీ కాలం ముగియడం, ఈసారి బీజేపీ అధిష్ఠానం ఆయనను తిరిగి నామినేట్ చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జార్జి కురియన్ సమర్పించిన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఇప్పటివరకు మోడీ క్యాబినెట్‌లో ఆయన మైనార్టీ వ్యవహారాల శాఖతో పాటు.. మత్స్య, పాడి, పశుపోషణ శాఖలకు కూడా సహాయ మంత్రి హోదాలో బాధ్యతలు నిర్వహించారు. జార్జి కురియన్ రాజ్యసభ ఎంపీ పదవీ కాలం గత ఆదివారం అంటే జూన్ 21న ముగిసింది.

## టెలిగ్రామ్‌పై నిషేధం ఎత్తివేత

- ప్లాట్‌ఫామ్‌లో పునరుద్ధరణ
- మెసేజ్ ఎడిటింగ్ ఆప్షన్ మాత్రం 30 తర్వాతే...

**న్యూఢిల్లీ, జూన్ 23 (ఎ.ఎం.ఎస్):**

నీట్ రీ ఎగ్జామ్ అనంతరం జూన్ 22 అర్ధరాత్రి వరకు టెలిగ్రామ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఆ నిషేధ గడువు ముగియడంతో గూగుల్ టెలిగ్రామ్‌ను తన ప్లాట్‌ఫామ్‌లో పునరుద్ధరించింది. అయితే మంగళవారం ఉదయం వరకూ యాపిల్ యాప్ స్టోర్‌లో మాత్రం టెలిగ్రామ్ అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. ప్రస్తుతం యాప్ అందుబాటులోకి వచ్చినా మెసెజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను జూన్ 30 వరకు నిలిపివేయనున్నారు. టెలిగ్రామ్‌పై కేంద్రం ఎందుకు నిషేధం విధించిందంటే నీట్ పరీక్షకు సంబంధించిన నకిలీ ప్రశ్నాపత్రాలు, తప్పుడు సమాచారాన్ని అడ్డుకోవడంలో టెలిగ్రామ్ విఫలమైందంటూ ఆరోపణలు వచ్చాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం నీట్ రీ ఎగ్జామ్ సజావుగా సాగాలంటే టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా బ్యాన్ చేయాలని నిర్ణయించింది. యాప్‌ను తాత్కాలికంగా బ్యాన్ చేసే విషయమై జూన్ 3వ తేదీనే టెలిగ్రామ్ ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వ అధికారులు సమావేశమయ్యారు. ఆ తర్వాత టెలిగ్రామ్‌తో పాటు దాని వెబ్ వర్షన్, దానికి సంబంధించిన లింకులు అన్నింటినీ జూన్ 22 వరకు బ్లాక్ చేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్ యాప్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కానీ, ఢిల్లీ హైకోర్టు కూడా టెలిగ్రామ్‌కు షాక్ ఇస్తూ కేంద్రం నిర్ణయాన్నే అమలు చేయాలని తీర్పు ఇచ్చింది.





ఈ వ్యవహారంపై టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ భారత ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శించారు. కొందరు వినియోగదారులు పరీక్ష ప్రశ్నపత్రాలు షేర్ చేశారనే కారణంగా.. మొత్తం యాప్‌ను నిషేధించడం సరైన నిర్ణయం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా యాప్‌పై

## ఇజ్రాయిల్‌కు ట్రంప్ వార్నింగ్..

- లెబనాన్‌పై సైనిక చర్యలకు ఖండన సమస్యలు పరిష్కరిస్తానంటూ కామెంట్

**న్యూయార్క్, జూన్ 23ః**

ఇరాన్‌తో అమెరికా యుద్ధానికి దిగడానికి ప్రధాన కారణం ఇజ్రాయెల్.. అలాంటిది ఇప్పుడు ఆ ఇజ్రాయెల్‌పైనే ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం చర్చలు జరుగుతున్న సమయంలో ఇజ్రాయెల్ లెబనాన్‌పై సైనిక చర్యలు చేపట్టడాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా ఇజ్రాయెల్‌కు వార్నింగ్ కూడా ఇచ్చారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యలపై ట్రంప్ స్పందించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ లెబనాన్‌లోని భద్రతా మండలిలో తమ సైన్యం కొనసాగుతుందని ప్రకటించడంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ సమస్యను కూడా తానే పరిష్కరిస్తానని చెప్పారు.

స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న అమెరికా ఇరాన్ చర్చలకు ఇజ్రాయెల్ చర్యలు ఆటంకం కలగకుండా ఎలా చూస్తారని విలేకర్లు ప్రశ్నించగా.. ట్రంప్ ఇన్‌డైరెక్ట్ ఆన్సర్ ఇచ్చారు. "నేను సమస్యలను పరిష్కరించే వ్యక్తిని. చాలా వేగంగా సమస్యలను పరిష్కరిస్తాను. బీబీ విషయంలో కూడా అలాగే చేస్తాను" అని ట్రంప్ అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని మాత్రం లెబనాన్‌లో తమ సైన్యం కొనసాగుతుందని చాలా స్పష్టంగా తెలియజేశారు. తమ ప్రజల భద్రత కోసం ఎంతకాలం అవసరమైతే అంతకాలం దక్షిణ లెబనాన్ భద్రతా మండలిలో ఉంటామని చెప్పారు. ఏ దేశమైనా సరే ఇలాంటి పరిస్థితుల్లో ఇదే చేస్తుందని, ఇజ్రాయెల్ కూడా అలాగే చేస్తుందని క్లారిటీ ఇచ్చారు.





తాను ప్రధానిగా పదవిలో ఉన్నంతకాలం ఇరాన్ అణ్వాయుధాలను పొందలేదని, పొందనివ్వబోమని నెతన్యాహూ స్పష్టం చేశారు. చర్చలు సఫలమైనా, విఫలమైనా తాను ఉన్నంతకాలం ఇరాన్‌కు అణ్వాయుధాను ఉండవు అని చెప్పారు. అమెరికా కూడా ఇదే పరిస్థితిలో ఉంటే సరిహద్దులు దాటి ఉగ్రవాదులను నిర్మూలించేదని నెతన్యాహూ అన్నారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత నుంచి అమెరికా ఇజ్రాయెల్ మధ్య కొన్ని అంశాల్లో విభేదాలు బయటపడ్డట్టు తెలుస్తున్నాయి. ముఖ్యంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల విషయంలో ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ తాను చెప్పినట్టు చేస్తుందని ట్రంప్ అంటే.. అమెరికా, ఇజ్రాయెల్ రెండూ స్వతంత్ర దేశాలు.. తమ తమ జాతీయ ప్రయోజనాల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటాయని బెంజమిన్ నెతన్యాహూ చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

## ఆ బాధ్యత మాదే..


### హర్మూజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్

**టెహ్రాన్, జూన్ 23ః**

హర్మూజ్ జలసంధి నిర్వహణ బాధ్యతలను ఇరాన్ స్వయంగా చూసుకుంటుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఇస్మాయిల్ బాఘేరి తేల్చిచెప్పారు. ఇరాన్ ప్రెస్‌టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమ నిర్వహణలో అంతర్జాతీయ నిబంధనలు పాటిస్తామని ఆయన పేర్కొన్నారు.. ఇరాన్ ప్రెస్‌టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జలసంధి యుద్ధానికి ముందున్న స్థితి ఎప్పటికీ రాదని, తమ నిర్వహణలో అంతర్జాతీయ నిబంధనలు పాటిస్తామని ఆయన పేర్కొన్నారు. స్విట్జర్లాండ్‌లో జరిగే చర్చల ఫలితాన్ని బట్టి ఇరాన్ తన నిర్ణయం తీసుకుంటుందని బాఘేరి తెలిపారు.



# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలు, త్యాగం మరువలేనిది...

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**కరీంనగర్ జూన్ 23 (వుదయం ప్రతినిధి):**
భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, మహనీయులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలు, త్యాగం మరువలేనివని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బిజెపి హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ వేడుకను నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి ముందుగా శ్యామ్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగాగంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒకే దేశం ఒకే జెండా, ఒకే రాజ్యాంగం ఉండాలనే లక్ష్యంతో అహర్నిశలు పోరాడిన గొప్ప దేశభక్తుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమగ్రతను కాపాడటంలో శ్యామా ప్రసాద్ చేసిన పోరాటం, ప్రాణత్యాగం భారత రాజకీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. దేశ సమగ్రత కోసం, జమ్మూ కాశ్మీర్‌లో ప్రత్యేక రాజ్యాంగం ఉండకూడదని (ఏక్ దేశ్ మే దో నిషాన్, దో విధాన్, దో ప్రధాన్ నహీ చలేంగే) పోరాటం చేస్తూ 1953 జూన్ 23న ఆయన కస్టడీలో ప్రాణాలు అర్పించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కన్న కలలను , ఆశయాలను మోడీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఆ దిశలోనే ఆర్టికల్ 370 రద్దు చేసి మోడీ ప్రభుత్వం డాక్టర్ శ్యామ ప్రసాద్ కు ఘనమైన నివాళులు అర్పించిందన్నారు .ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఆదిలాబాద్ అభివృద్ధికి గేట్‌వేగా ఎయిర్‌పోర్ట్

## త్వరలో శంకుస్థాపన

**ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్ (వుదయం ప్రతినిధి) :**
ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం జిల్లా అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా మారనుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఢిల్లీలో జరిగిన కేంద్ర-రాష్ట్ర స్థాయి చర్చలపై కీలక వివరాలు వెల్లడించారు.
ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై ముఖ్యమైన అవగాహన కుదిరిందని, వెనుకబడిన జిల్లాకు ఇది పెద్ద అవకాశమని చెప్పారు. ఇప్పటికే గుర్తించిన 1,880 ఎకరాలకు అదనంగా మరో 400 ఎకరాల భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుందని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (AAI) 80 ఎకరాలు తక్షణమే కేటాయించి టెర్మినల్ నిర్మాణానికి మార్గం సుగమం చేసినట్లు వివరించారు.
హైటెన్షన్ విద్యుత్ లైన్ల మార్పిడికి రూ.340 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాలకు సుమారు రూ.600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు. భూసేకరణ నిధులపై



కేంద్రం సానుకూలంగా స్పందించిందని, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డికి స్పష్టం చేసినట్లు తెలిపారు.
భూసేకరణ పూర్తైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్గో సేవలు ప్రారంభమైతే జిల్లాలో తయారయ్యే ఉత్పత్తులకు జాతీయ-అంతర్జాతీయ మార్కెట్లు చేరుతాయని అన్నారు.
అదేవిధంగా రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, రామాయి-రాంపూర్ మధ్య ఈ పరిశ్రమ ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అన్ని అనుమతులు దాదాపు పూర్తయ్యాయని, 1-2 సంవత్సరాల్లో ఉత్పత్తి ప్రారంభ లక్ష్యంతో పనులు సాగుతున్నాయని చెప్పారు. జిల్లాలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు సున్నపురాయి నిల్వలున్న ప్రాంతాలను టెండర్ల ద్వారా వినియోగించే అంశం కూడా కేంద్ర స్థాయిలో చర్చలో ఉందని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాల నిర్మూలనకు

## విస్తృత అవగాహన కల్పించాలి

- సఖి కేంద్రం, హెల్ప్‌లైన్ సేవలను ప్రజలకు చేరవేయాలి.
- సంక్షేమ శాఖ అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు.

**రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (వుదయం ప్రతినిధి):**
జిల్లాలో బాల్య వివాహాల నివారణకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సఖి కేంద్రం సేవలు, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 181 మహిళా హెల్ప్‌లైన్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.
మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మహిళలు, బాలికలు అత్యవసర పరిస్థితుల్లో 1098, 181 హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలను అర్హులైన వారికి చేరవేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న బాలబాలికలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు, పోషకాహారం అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.



బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, విద్యా పరమైన నష్టాలపై గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రాప్‌ఔట్ కేసులను గుర్తించి తిరిగి విద్యాబాట పట్టించే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బాలల సంరక్షణకు సంబంధించిన కేసుల పురోగతిపై కూడా కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు

**ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి**

**కలెక్టర్ తో కలిసి నవీపేటలో స్థల పరిశీలన**

**నిజామాబాద్, జూన్ 23 :**
విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. నవీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన పరిస్థితులను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ స్కూల్ కోసం అందుబాటులో ఉన్న స్థలం, ఇతర వసతులను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు, అధునాతన సౌకర్యాలతో 4 ఎకరాల విస్తీర్ణంలో ఒకే చోట ఒకటవ తరగతి నుండి 12 తరగతి వరకు నాణ్యమైన విద్యా బోధన జరిగేలా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే బోధన్ నియోజకవర్గంలో రూ. 200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. కాగా, అధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు తరగతి గదులతో పాటు, ల్యాబ్ రూమ్ లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్.ఓ ప్లాంట్, బోర్ వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకం అయ్యారు. పలు ప్రశ్నలు వేస్తూ, విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు, బహుమతులు అందించి ప్రోత్సహించారు. వీరి వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

## రైతులు సంక్షేమమే సర్కార్ ధ్యేయం

- సన్న రకాలు సాగు చేయండి...
- విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల జూన్ 23 (వుదయం ప్రతినిధి)**
రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ (శ్రీరాముల పల్లి) రైతు వేదిక లో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో కలిసి మంగళవారం ప్రారంభించారు ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వరి ధాన్యం మొక్కజొన్న దిగుబడి వచ్చిందన్నారు అధికారుల సమన్వయంతో పని చేసి రికార్డు స్థాయిలో ధాన్యం మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు



రకాల విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లి గ్రామంలో 70 లక్షల రూపాయలతో ప్రమాదకరంగా ఉన్న కరెంట్ వైర్లు తొలగించినట్లు మంత్రి వివరించారు గ్రామంలో ఐకేపీ సెంటర్ తో పాటు గ్రౌండ్ ప్రతిపాదనలు వచ్చాయని గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, హెచ్ఎంటీ సోనా జైశ్రీరామ్ కేఎన్ఎం1638 కేఎన్ఎం7715 తదితర నాణ్యమైన వరి విత్తనాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించి మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని సూచించారు నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా పంట నాణ్యత పెరిగి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరుతుందని పేర్కొన్నారు అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు గతంలో పెద్ద ఎత్తున రైతులు యూరియా స్టాక్ చేసే వారిని కొత్తగా తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు అధిక మొత్తంలో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గుతుందన్నారు రోడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని కలెక్టర్ తెలిపారు రైతులు సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఏడు రకాల విత్తనాలు మాత్రమే సాగు చేయాలన్నారు రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు



## ఆర్‌టీఐ ఫిర్యాదులతో కదిలిన ఆరోగ్య శాఖ

**కాగజ్‌నగర్ ప్రైవేట్ ఆసుపత్రులపై డీఎంహెచ్‌ఓ బృందం తనిఖీలు.**

**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి) జూన్ 26:**
సీనియర్ ఆర్‌టీఐ & మానవ హక్కుల కార్యకర్త మొహమ్మద్ షహబాజ్ దాఖలు చేసిన ఆర్‌టీఐ దరఖాస్తులు, ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్‌ఓ) బృందం కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. డీఎంహెచ్‌ఓ డా. కె. సీతారాం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. నాగేందర్, సూపరింటెండెంట్ డా. షఫీతో పాటు ఇతర ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.
తనిఖీల సందర్భంగా ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ పత్రాలు, వికలాంగుల కోసం ర్యాంప్ సౌకర్యాలు, పరిశుభ్రత ప్రమాణాలు, చికిత్సల ధరల జాబితా ప్రదర్శన, ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల లైసెన్సులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.
విజయ హాస్పిటల్, విజేత హాస్పిటల్, మమత హాస్పిటల్, శైలజ హాస్పిటల్, కాగజ్‌నగర్ డయాగ్నస్టిక్ సెంటర్, శణ్ముఖ హాస్పిటల్, మా హాస్పిటల్, కిరణ్ హాస్పిటల్ తదితర ఆసుపత్రులను అధికారులు తనిఖీ చేశారు.
తనిఖీల అనంతరం నిబంధనల అమలులో లోపాలు గుర్తించిన ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన అధికారులు, 20 రోజులలోపు వికలాంగుల ర్యాంప్ నిర్మాణం పూర్తి చేయాలని, అలాగే చికిత్సలు మరియు ఇతర సేవల ధరల జాబితాను ఆసుపత్రి నోటీసు బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా సీనియర్ ఆర్‌టీఐ & మానవ హక్కుల కార్యకర్త మొహమ్మద్ షహబాజ్ మాట్లాడుతూ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెంటనే స్పందించి తనిఖీలు నిర్వహించిన డీఎంహెచ్‌ఓ బృందానికి, ఆరోగ్య శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు

**-రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల/జూన్ 23(వుదయం ప్రతినిధి)**
జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం, సిర్స, రొయ్యలపల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి భూమి పూజ చేశారు. లింగన్నపేట గ్రామంలో గతంలో 14 నూతన విద్యుత్ పోల్స్, 4 బోర్ వెల్స్ పనులను దాదాపు 20 లక్షల రూపాయల ఈజీఎస్, ఎస్.డి.ఎఫ్. నిధులతో చేపట్టి ఇప్పుడు 10 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఏదుల బంధంలో 15 లక్షల రూపాయల ఎస్.డి.ఎఫ్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని, ఆల్గాం, వెంచపల్లి, జనగాం గ్రామాలలో 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం అందించడం జరుగుతుందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 2 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, 200 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 100 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ 2.0 పథకం ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించేందుకు నీటి ట్యాంకులు, పైపు లైన్ల ఏర్పాటు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. 46 కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వైద్య రంగ బలోపేతం దిశగా కృషి చేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించడం



జరుగుతుందని, 23 మంది వైద్యులను నియమించి చెన్నూర్ లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, మందమర్రి ప్రాంతంలో 50 పడకల ఆసుపత్రి పున:ప్రారంభానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చి 11 వేల కోట్ల రూపాయల లాభాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. ఇసుక మాఫియా నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, సి.సి. కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆల్గాం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మూత్రశాలలు, విద్యుత్, ఇతర మరమ్మత్తు పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయాలపై పోలీసు శాఖ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖాన, వనమహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్



**కామారెడ్డి, జూన్ 23 (వుదయం ప్రతినిధి):-**
జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా గ్రామంలోని పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్, అవుట్ పేషంట్ (ఓపీ) రిజిస్టర్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.
అనంతరం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు.తదుపరి మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఎల్లంపేట గ్రామానికి చెందిన బుద్ధి నవీన (భర్త: స్వామి) ను అభినందించి, ప్రభుత్వం తరపున గుర్తింపుగా గోడ గడియారాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





## విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన ఉండాలి



**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**నిర్మల్ జిల్లా 23 జూన్ 2026 (వుదయం ప్రతినిధి)**
ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు.
తరగతిగదిలోని విద్యార్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవాలన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు, అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు.
అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు.
అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు.
ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి నుండి కరీంనగర్ ఇక ప్రయాణం సులభతరం

- ధర్మపురి నుంచి నూతన బస్సు సర్వీసులను ప్రారంభించిన మంత్రి అడ్లూరి
- ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11 రూట్లలో సర్వీసులు
- ఆర్టీసీ రెవెన్యూ పెంచేలా ప్రజలు సహకరించాలి



**ధర్మపురి,జూన్23 (వుదయం ప్రతినిధి):**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.ధర్మపురి క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ధర్మపురి నుంచి నిర్మల్, కరీంనగర్‌లకు మంగళవారం రెండు కొత్త బస్సు సర్వీసులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి బస్టాండ్ లో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి వస్తుంటారని గుర్తుచేశారు. భక్తుల ప్రయాణ క్లిష్టతలను అధిగమించేందుకు నిర్మల్ నుంచి ధర్మపురి వరకు ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు నిర్మల్ నుంచి బయలుదేరి దస్తురాబాద్,కడెం, ఖానాపూర్ మీదుగా ధర్మపురి చేరుకుంటుందని రోజుకు రెండు ట్రిప్పుల చొప్పున ఈ సర్వీస్ నడుస్తుందని మంత్రి వివరించారు.ధర్మపురి నుంచి జగిత్యాల మీదుగా కరీంనగర్ ప్రయాణం కష్టంగా మారిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కొత్త బస్సు సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు.
ఈ కొత్త సర్వీస్ ఉదయం 7 గంట లకు జగిత్యాల నుంచి బయలుదేరి ధర్మపురి,రాయపట్నం,వెల్గటూర్,ధర్మారం మీదుగా కరీంనగర్ చేరుకుంటుందని పేర్కొన్నారు.ఈ రూట్ విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, రాత్రి వేళల్లో ప్రయాణించే వారి కోసం కరీంనగర్ నుంచి రాత్రి 9 గంట లకు ధర్మపురికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చొరవతో ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11 రూట్లలో నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి అనుమతులు సాధించామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సగర్వంగా ప్రకటించారు. నియోజకవర్గం లోని విద్యార్థుల సౌకర్యార్థం త్వరలోనే మిగతా రూట్లలోనూ బస్సులు నడపడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు, రెవెన్యూ వృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ఆర్టీసీ అద్భుతమైన సేవలు అందిస్తోందని కొనియాడారు.
భక్తులు, ప్రజలు ఈ నూతన సర్వీసులను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్,మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య,వేముల.రాజేష్, ధర్మ పురి మున్సిపల్ కౌన్సిలర్లు, జగిత్యాల డిపో మేనేజర్ రమేష్, నిర్మల్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ జగిత్యాల సీఐ శ్రీనివాస్, ఎఫ్ఎం నిర్మల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న బిఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ జూన్ 23 (వుదయం ప్రతినిధి): చొప్పదండి నియోజకవర్గంలో మేజర్ గ్రామపంచాయతీ అయిన రామడుగు సర్పంచ్ మహమ్మద్ మొయిజ్ ,మరియు ఏడుగురు వార్డు సభ్యులు కరీంనగర్ డిసిసి అధ్యక్షులు మరియు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పథకాలకు ఆకర్షితులై మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెడికల్ సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ రామడుగు గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాను అని రామడుగు గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు సన్న రకాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- బోనస్ పొందేందుకు ప్రభుత్వం గుర్తించిన రకాలనే సాగు చేయాలి ప్రభుత్వ విప్ విజయరమణారావు
- విత్తన మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే



పెద్దపల్లి, జూన్ 23 (వుదయం కరస్పాండెంట్):రైతులు సన్న రకాల వరి సాగుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రైతులు సన్న రకాల వరి సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందాలని కోరారు.ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకాల విత్తనాలు రైతు వేదికల ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న రకాల వరి సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తొందరపడి విత్తనాలు వేయకుండా తగినంత వర్షాలు కురిసిన తర్వాతే సాగు ప్రారంభించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని కోరారు.
జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అలాగే రైతులు నానో ఎరువుల వినియోగాన్ని పెంచి సాగు ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్,
వ్యవసాయ అధికారి పైడితల్లి, ఏఈవోలు రాజు, పద్మ, అనూష, రవితేజ, ఆనంద్‌రావు, విత్తన డీలర్లు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్లకు సర్కారు భరోసా...

## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



జగిత్యాల జూన్ 23 (వుదయం ప్రతినిధి) జన్మనిచ్చిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాధరణకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల భద్రత చట్టం-2026 తెచ్చిందని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అన్నారు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వయోధికుల వేధింపుల నివారణకు అవగాహన పక్షోత్సవాల సందర్భంగా టాస్క ముద్రించిన అవగాహన పిలుపు పత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని వృద్ధుల భద్రతకు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు జిల్లా కేంద్రంలో ప్రభుత్వం తరపున తన వినతి మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వృద్ధాశ్రమం నిర్మాణం పూర్తయ్యిందని త్వరలో అందుబాటులోకి వస్తుందని అల్పాహారం వైద్య సేవలు వినోద కార్యక్రమాల కోసం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయించామన్నారు పిల్లల నిరాధరణకు గురవుతున్న సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారం సంక్షేమం కోసం జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వారి సంఘాల ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం పి హన్మంత్ రెడ్డి బొల్లం విజయ్ ఎండి యాకూబ్ తదితరుల సేవలను అభినందించారు సీనియర్ సిటిజన్స్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం సమస్యల పరిష్కారం కోసం సీనియర్ సిటిజన్స్ కమిషన్ ఏర్పాటు కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ సేవలకు అసోసియేషన్ భవన్ నిర్మాణంకు ప్రభుత్వ స్థలం నిధులు కేటాయించాలని కోరారు జిల్లాలో కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి మెట్ పల్లి ఆర్డీవో జీ నర్సింహా రావు లు వృద్ధులు కేసులు పరిష్కారం లో తమ అసోసియేషన్ సహకారంతో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా నిలిచారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిసి హన్మంత్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ ఎండి యాకూబ్ కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు ఆర్గనైజింగ్ కార్యదర్శులు కొయ్యడ సత్యనారాయణ వొద్దినేని పురుషోత్తం రావు బాలయ్య సంయుక్త కార్యదర్శులు సయ్యద్ యూసుఫ్ ఎండి ఇక్బల్ కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చి రెడ్డి ధర్మపురి అధ్యక్షులు కండ్ గంగాధర్ కార్యదర్శి దుబ్బేశం సారంగపూర్ అధ్యక్షులు కే గంగారెడ్డి గొల్లపల్లి అధ్యక్షులు వీరారెడ్డి రాయికల్ అధ్యక్షులు వేణుగోపాల్ రావు మహిళా కార్యదర్శులు బొబ్బాటి కరుణ విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

## డాక్టర్ కావటి సతీష్



మంథని, జూన్ 23 (వుదయం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కావటి సతీష్ పిలుపునిచ్చారు. మంగళవారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి ఉద్యమకారులంతా పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సువర్ణ సులోచన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు సత్వర న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు తోకల మల్లేష్, మిరాల రామ్‌రెడ్డి, ముస్కే ఈశ్వరమ్మ, సాధుల శ్రీను, చిదురాల మధుకర్‌రెడ్డి, ఎస్.కె. ముబీబ్, కోరవేణ కుమార్, ఏటా రవి, రామడుగు మారుతి, కాసిపేట మల్లేష్, ముత్తినేని నరేష్, దాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధికి శిక్షణే మార్గదర్శి

## – హైదరాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ల శిక్షణలో పాల్గొన్న పుల్కం రాజు.





వేములవాడ, జూన్ 23 (వుదయం ప్రతినిధి ): పట్టణాల సమగ్రాభివృద్ధి, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవల అందజేత లక్ష్యంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సామర్థ్యాభివృద్ధి (కెపాసిటీ బిల్డింగ్) శిక్షణ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల మేయర్లు, చైర్‌పర్సన్లు హాజరయ్యారు. పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య నిర్వహణ, ఆధునిక మున్సిపల్ పాలన, ప్రజలకు సమర్థవంతమైన సేవల అందజేత వంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చారు. వివిధ పట్టణాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను వివరించి, అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ, శిక్షణలో పొందిన సూచనలు, ఆధునిక పట్టణ నిర్వహణ విధానాలను వేములవాడలో అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పనలో మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన మున్సిపల్ సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



# ముఖర్జీ ఆశయాలే బీజేపీకి మార్గదర్శకం

వేములవాడ, జూన్ 23 టవుదయం ప్రతినిధిఊ: భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి దేశ రాజకీయాల్లో కొత్త చైతన్యాన్ని తీసుకొచ్చిన మహానేత శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని పేర్కొన్నారు. దేశ సమగ్రత కోసం పోరాడిన ఆయన జైల్ లోనే తుదిశ్వాస విడిచారని,ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం బలిదాన్ దివాస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ నాయకుడు ప్రతాప్ రామకృష్ణ మాట్లాడుతూ ఒకే దేశం అనే భావనతో దేశ ఐక్యత కోసం ముఖర్జీ కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాల ఆధారంగానే బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, రాష్ట్ర నాయకులు రేగుల రాజు, కోల కృష్ణస్వామి, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్లు వంగల శ్రీను, కండ్లేపు ముత్యం, మైలారం శ్రీనివాస్, బిజెపి నాయకులు పిన్నింటి హనుమాన్లు, బోనాల శివ, మామిళ్ల లక్ష్మీరాజం, బిల్లా కృష్ణ, కటకం శ్రీనివాస్, జవ్వజి శేఖర్, అన్నం నరసయ్య, కుమ్మరి నరేష్, చిక్కుడు మల్లేశం, రఘుపతి, సగ్గు రాహుల్, పోతారం సాయి,లాలా శేఖర్ రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొని ముఖర్జీకి శ్రద్ధాంజలి ఘటించారు.

# ధర్మపురిలో డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



ధర్మపురి,జూన్23(వుదయం ప్రతినిధి):
భారతీయ జనసంఘ్ వ్యవ స్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ధర్మపురి పట్టణం లో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. బిజెపి పట్టణ అధ్య క్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖర్జీ నిజమైన దేశభక్తుడని, జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదా ఆర్టికల్ 370కు వ్యతిరేకంగా, ఒకే దేశం-ఒకే చట్టం కోసం పోరాడి అమరుడయ్యారని కొనియాడా రు.?ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు,కమలాపూర్ సర్పంచ్ కుమ్మరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా కో-కన్వీనర్ పూదరి పవన్, పట్టణ ప్రధాన కార్యదర్శులు తిరుమందాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, బీజేవైఎం నాయకులు మండలోజీ సూరజ్, కోశాధికారి సంఘీ రాజేష్, సోమిశెట్టి శివ సాయి, మామిడిపల్లి రంజిత్, అప్పం శ్రీనివాస్, సందవేణి సతీష్, సంగా వెంకటగిరి, మల్కన్నా, రాగుల కాంతన్న, సోషల్ మీడియా ఇన్చార్జి కాశెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలు, త్యాగం మరువలేనిది...

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

కరీంనగర్ జూన్ 23 (వుదయం ప్రతినిధి):భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, మహనీయులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలు, త్యాగం మరువలేనివని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బిజెపి హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ వేడుకను నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముందుగా శ్యామ్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగాగంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒకే దేశం ఒకే జెండా, ఒకే రాజ్యాంగం ఉండాలనే లక్ష్యంతో అహర్నిశలు పోరాడిన గొప్ప దేశభక్తుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు.

## ఈఓ డ్రైవర్ కి ఉద్యోగ బాధ్యతలు , క్యాష్ దందా..!!



మల్యాల మండలం ఏప్రిల్ 23 (వుదయం ప్రతినిధి)
జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం చోటుచేసుకున్న ఒక ఘటన భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆలయ ఈవోకు కారు డ్రైవర్‌గా విధులు నిర్వహించే వ్యక్తి ఆలయ ఉద్యోగి తరహాలో బాధ్యతలు నిర్వర్తించడం చర్చనీయాంశంగా మారింది. ఆలయంలో విధులు, బాధ్యతలు స్పష్టంగా విభజించి ఉన్నప్పటికీ డ్రైవర్ ఉద్యోగి అవతారం ఎత్తి భక్తులతో వ్యవహరించడం, కొన్ని పరిపాలనా పనుల్లో జోక్యం చేసుకోవడం పట్ల భక్తులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖలో నియమిత సిబ్బంది ఉండగా ఇతరులు వారి పనులను నిర్వహించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు. ఆలయ పరిపాలనలో విధి నిర్వహణకు సంబంధించిన నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు పర్యవేక్షణలో లోపం వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈ ఘటనపై స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆలయ పరిపాలనలో పారదర్శకతను నెలకొల్పాలని భక్తులు కోరుతున్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మల్యాల మండలం ఏప్రిల్ 23 (వుదయం ప్రతినిధి)
జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయానికి చేరుకోగానే ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డి పూలమాల వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వస్తి వేదమంత్రాలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కి నివాళి



మల్యాల మండలం జూన్ 23 ( వుదయం ప్రతినిధి )
బిజెపి మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ కి వినమ్ర నివాళి , ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదనే సిద్ధాంతం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370కు వ్యతిరేకంగా పోరాడుతూ, 1953 జూన్ 23న పోలీసు నిర్బంధంలో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారని పేర్కొన్నారు.
భారత ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయం.డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా బిజెపి మల్యాల మండల శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు పొన్నగంటి గౌతం , మహిళా మోర్చా అధ్యక్షురాలు కటకం లత , మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేష్, కరబుజచక్రం గౌడ్ , గుండేటి గంగారం , గడ్డం చిన్న మల్లేశం మరియు జక్కుల రమేష్ పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా బూడిద గణేష్

మంథని, జూన్ 23 (వుదయం ప్రతినిధి):



మంథని పట్టణానికి చెందిన బూడిద గణేష్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ నెల 20, 21, 22 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాల్గవ రాష్ట్ర మహాసభలో ఆయనను రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ శ్రమజీవులు, వ్యవసాయ కార్మికులు, కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఉద్యమబాటలో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన సంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ఉద్యమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైన బూడిద గణేష్‌ను వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, మిత్రులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

## గ్రీన్ టీ మ్యాజిక్.. శరీరంలో కలిగే మార్పులు



ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి వారికి ఓ శుభవార్త. ప్రతిరోజూ గ్రీన్ టీ తాగడం వల్ల కేవలం రెండు వారాలలోనే శరీరంలో సానుకూల మార్పులు వస్తాయని ఓ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో వెల్లడించారు. ఈ వీడియో వైరల్ కావడంతో మరోసారి గ్రీన్ టీ హెల్త్ బెనిఫిట్స్ గురించి అంతా మాట్లాడుతున్నారు. ప్రాసెసింగ్ చేయని కామెల్లియా సినెన్సిస్ ఆకులు, మొగ్గల నుంచి గ్రీన్ టీని తయారు చేస్తారు. క్రీస్తుపూర్వం 1వ సహస్రాబ్ది చివరిలో చైనాలో ఈ పానీయం ప్రాచుర్యం పొందింది. అప్పటి నుంచి దీనికి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతారు. పారదర్శక కడుపు ఉన్న ఒక పౌరాణిక వ్యక్తి షెన్ నాంగ్, మానవ శరీరంపై టీ సానుకూల ప్రభావాలను మొదటిసారిగా గమనించినట్లు పురాతన చైనీస్ గ్రంథాలు పేర్కొంటాయి.

ఆయుష్షును పెంచుతుంది.. జీర్ణక్రియ, కాలేయం, ప్యాంక్రియాస్, పోషకాహార నిపుణుడు డా. జోసెఫ్ సల్హాబ్, 'ది స్టమక్ డాక్' గా 1.4 మిలియన్ల మంది ఫాలోవర్లకు సుపరిచితులు. ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో ప్రతిరోజూ గ్రీన్ టీ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. "క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగే వారికి గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది, రక్తపోటు తగ్గుతుంది, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది, డిమెన్షియా ప్రమాదం తగ్గుతుంది. అంతేకాక, ఇది మీ ఆయుష్షును కూడా పెంచుతుంది" అని డా. సల్హాబ్ పేర్కొన్నారు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి గ్రీన్ టీ..గ్రీన్ టీ జీర్ణ వ్యవస్థపై సానుకూల సూక్ష్మజీవి ప్రభావాన్ని చూపుతుంది. 2012లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, 10–14 రోజులలోపు ఇది బిఫిడోబాక్టీరియా ఇతర ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియాను పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను, మంటను తగ్గిస్తుంది. కాలేయ ఆరోగ్యానికి గ్రీన్ టీ.. గ్రీన్ టీ "మీ కాలేయాన్ని రక్షించడంలో, ఫ్యాటీ లివర్ పురోగతిని కూడా నెమ్మదింపజేయడంలో సహాయపడుతుంది" అని డా. సల్హాబ్ వీడియోలో తెలిపారు. 2013లో ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ మాలిక్యులర్ మెడిసిన్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, అధిక సాంద్రత కలిగిన కాటెచిన్స్ ఉన్న గ్రీన్ టీ నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ ఉన్న రోగులలో కాలేయ కొవ్వును, మంటను మెరుగుపరుస్తుంది.

గుండె ఆరోగ్యానికి గ్రీన్ టీ.. "క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగే వారికి గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది" అని డా. సల్హాబ్ వివరించారు. పెద్ద జనాభా అధ్యయనాలు క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగేవారిలో అన్ని కారణాల మరణాలు, కార్డియోవాస్కులర్ మరణాలు తక్కువగా ఉన్నాయని సూచిస్తున్నాయి. గ్రీన్ టీ వినియోగం శరీరంలోని వివిధ రకాల పనితీరులను మెరుగుపరుస్తుంది. ఇది మెటబాలిక్ పరిస్థితులతో ఉన్న రోగులలో రక్తపోటు, ఇన్ఫ్లమేటరీ బయోమార్కర్లు, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గిస్తుంది. గ్రీన్ టీలో ఉండే ఎల్–థియానైన్ అభిజ్ఞా క్షీణత, డిమెన్షియా ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

## ఆహారాలు డైట్‌లో యాడ్ చెయ్యండి.. గుండె ఆరోగ్యం పదిలం..



ఇప్పుడున్న కాలంలో గుండెకు సంబంధించిన వ్యాధులతో చాలా మంది బాధపడుతున్నారు. జీవనశైలి, తీసుకునే ఆహారం, టెన్షన్, ఉద్యోగంలో ఒత్తిడి తదితర కారణాల వల్ల మనిషికి గుండెకు సంబంధించిన వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి అనువైన వ్యాయామం, దురవాట్లకు దూరంగా ఉండటం గుండె ఆరోగ్యానికి రాచబాట వేస్తాయి. మధుమేహం, అధిక రక్తపోటు , మూత్రపిండ వ్యాధులు, దంత, తదితర వ్యాధులు గుండెజబ్బులకు దారితీస్తాయి. దేశంలో గుండె సమస్యలతో ఎంతో మంది బాధపడుతున్నారు. గుండె సంబంధిత వ్యాధుల కారణంగా ఎంతో మంది మరణిస్తున్నారు. వేళకు ఆహారం తీసుకోకపోవడం, వ్యక్తిగత, వృత్తిపరమైన ఒత్తిళ్లు, తగినంత వ్యాయమం లేకపోవడం వంటివి గుండె పనితీరును మందగింపజేస్తున్నాయి. రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగిపోవడం కూడా గుండె పనితీరును ప్రభావితం చేస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చేపలు తింటే ఉపయోగాలెన్నో: సాధారణంగా చేపలు ఎక్కువగా తినేవారిలో హృదయ సంబంధిత వ్యాధులు తక్కువేనంటున్నారు వైద్య నిపుణులు. చేపల్లో ఉండే ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు గుండె పనితీరును మెరుగు పరుస్తాయి. ఆకు కూరలు: ఆకు కూరలు గుండెకు ఎంతో మంచిది. క్యాన్సర్ వంటి రోగాలను సైతం దరిచేరనివ్వవు. పాలకూర, కొత్తిమీద, ర్యాడిష్ మొదలైన వాటిలో కొవ్వు శాతం తక్కువ ఉండటంతో పాటు ఫోలిక్ యాసిడ్, మెగ్నీషియం, కాల్షియం, పోటాషియం ఎక్కువగా లభిస్తాయి. ఇవి గుండె పనితీరును మెరుగు పర్చడంలో ఎంతో సహాయపడతాయి. రోజూ ఆహారంలో భాగంగా ఇవి తీసుకునేవారికి మిగిలిన వారితో పోలిస్తే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు 11 శాతం తక్కువగా ఉంటాయి. ఓట్స్: ప్రతిరోజు ఉదయం బ్రేక్‌ఫాస్టులో ఓట్స్ తినడం గుండెకు ఎంతో మేలు చేస్తాయి. వీటిలో లభించే బీటా గ్లూకాన్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. అందుకే ప్రతిరోజు ఓట్స్ తీసుకోవాలి. గోధుమలు, బార్లీ, పప్పు ధాన్యాలు, బీన్స్ మొదలైనవి ఆహారంలో తీసుకోవడం మంచిది. వీటిలో ఉండే విటమిన్స్, ఐరన్, ఫైబర్ యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటును అదుపులో ఉంచుతాయి. దీని ద్వారా గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఇవే కాకుండా టోమాటోలు, యాపిల్స్, సోయా వంటివి రోజువారీగా తీసుకున్నట్లయితే గుండెను పూర్తిగా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

## ఉదయాన్నే జీలకర్ర నీరు తాగితే..



జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం. జీలకర్ర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది అందరి ఇళ్లలో ప్రతి వంటగదిలో అందుబాటులో ఉంటుంది. జీలకర్ర అనేది ప్రతి వంటల్లో ఉపయోగిస్తుంటారు. దీని వల్ల ఆహారం రుచిగా ఉండడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం. జీలకర్ర నీటిని ఖాళీ కడుపుతో తాగితే శరీరంలోని అనేక వ్యాధులు నయమవుతాయి. బలహీనమైన శరీరాన్ని బలోపేతం చేయడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని రోజూ తాగడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇందులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. జీలకర్రలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది మీ వ్యాధిని నయం చేయడంలో మీకు చాలా సహాయపడుతుంది. మీరు ప్రతిరోజూ ఉదయం తప్పనిసరిగా జీలకర్ర నీటిని తాగాలి. ఇది శరీరంలో వాపులను తగ్గించడానికి కూడా పనిచేస్తుంది. ఇది మాత్రమే కాదు, వివిధ వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో ఇది చాలా సహాయపడుతుంది. అలాగే శరీరంలోని మురికిని తొలగిస్తుంది. చాలా మందికి శ్వాస సంబంధిత సమస్యలు చాలా ఉన్నాయి. మీరు ఖాళీ కడుపుతో ప్రతిరోజూ జీలకర్ర నీటిని తాగితే, మీరు శ్వాస ఆరోగ్యానికి సంబంధించిన అనేక సమస్యల నుండి బయటపడవచ్చు. శ్వాసకోశంలో ఉపశమనం కలిగించవచ్చు. మీరు దాని నీటిని చాలా వేడిగా తాగాల్సిన అవసరం లేదు. మీరు దానిని గోరువెచ్చగా మాత్రమే తాగాలి. జీలకర్ర నీటిలో యాంటీఆక్సిడెంట్ పదార్థాలు ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో మీకు సహాయపడుతుంది. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత ఈ నీటిని తాగాలి.

## వర్షకాలంలో తినకూడని ఆహారపదార్థాలు..!



వర్షకాలం వచ్చేసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడం, శరీరంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చాలా మంది అనేక వ్యాధుల బారిన పడుతుంటారు. అందుకే ఈ సీజన్‌లో ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తుంటారు వైద్యనిపుణులు. అయితే వర్షాకాలంలో అస్సలే ఐదు ఆహారపదార్థాలు తినకూడదంట. వర్షకాంలో స్ట్రీట్ ఫుడ్ అస్సలే తినకూడదంట. బండ్లపై దొరికే సమోసాలు, బజ్జీలు వంటివి, అలాగే పానీపూరి అస్సలు తినకూడదు అని చెబుతున్నారు ఆరోగ్యనిపుణులు. అపరిశుభ్రత కారణంగా బయట ఫుడ్ తినడం వలన కడుపులో ఇన్ఫెక్షన్స్, వచ్చి కడుపునొప్పి, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయంట. అందుకే స్ట్రీట్ ఫుడ్‌కు ఎంత దూరం ఉంటే అంత మంచిదంటున్నారు నిపుణులు. సిట్రస్ ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో విటమిన్ డి,సి వంటివి ఎక్కువగా ఉంటాయి. అయితే వీటిని వర్షకాలంలో ఎక్కువగా తినకూడదంట. ముఖ్యంగా కట్ చేసి అమ్మేటువంటి సిట్రస్ ఫ్రూట్స్ వర్షకాలంలో ఎక్కువగా కలుషితం అవుతాయంట. దీని వలన అనేక సమస్యలు వస్తుంటాయి. అందుకే వీలైనంత వరకు వీటికి దూరంగా ఉండాలంట. కొంత మందికి పెరుగు, మజ్జిగ అంటే చాలా ఇష్టం ఉంటుంది. వారు సీజన్‌తో పని లేకుండా పెరుగు, మజ్జిగా ఎక్కువ తింటుంటారు. అయితే వర్షకాలంలో పెరుగు లేదా మజ్జిగా ఎక్కువగా అస్సలే తీసుకోకూడదంట. ఎక్కవ మోతాదులో తీసుకోవడం వలన కడుపులో అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు వైద్య నిపుణులు. అందుకే వర్షకాలంలో పెరుగు, మజ్జిగా మితంగా తీసుకోవాలంట. వర్షకాలంలో కార్బోనేటెడ్ డ్రింక్స్‌కు ఎంత దూరం ఉంటే అంత మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే ఎక్కువ చల్లగా ఉండే కార్బోనేటెడ్ డ్రిక్స్ వర్షకాలంలో ఎక్కువగా తాగడం వలన అనేక సమస్యలు వస్తాయంట. ముఖ్యంగా జీర్ణసంబంధ వ్యాధులతో సతమతం అవ్వాల్సి ఉంటుందంట. అందుకే వర్షాకాలంలో కార్బోనేటెడ్ డ్రింక్స్ తాగకూడదంట. వర్షాకాలంలో చాలా మంది టీ, కాఫీస్ ఎక్కువగా తాగుతుంటారు. కానీ శరీరానికి వెచ్చదనం ఇస్తుందని వీటిని ఎక్కువగా తాగడం వలన ఇది కడుపులో గ్యాస్ వంటి సమస్యలకు కారణం అవుతుందని అంటున్నారు ఆరోగ్య నిపుణులు.

## కాలేయనికి కొండంత అండ..



శరీరానికి శక్తి కేంద్రంగా జీవక్రియ ప్రక్రియల నుంచి రోగనిరోధక వ్యవస్థ మద్దతు, పోషక నిల్వ, వ్యర్థాల తొలగింపు వరకు, కాలేయం ఒక బహుళ విధుల అద్భుతం. అందువలన కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తప్పనిసరి అవుతుంది. వెల్లుల్లి – శక్తివంతమైన డీటాక్సిఫైయర్: ఘాటైన రుచికి ప్రసిద్ధి చెందిన వెల్లుల్లి, కాలేయ ఆరోగ్యానికి శక్తివంతమైన మిత్రుడు.

అల్లిసిన్, సెలీనియం, ఇతర ప్రయోజనకరమైన సమ్మేళనాలతో నిండిన వెల్లుల్లి, కాలేయాన్ని నిర్విషీకరణ చేయడంలో, పిత్త ఉత్పత్తిని ప్రేరేపించడంలో సహాయపడుతుంది. సలాడ్‌లకు పచ్చిగా జోడించినా లేదా వివిధ వంటలలో ఉడికించినా, మీ భోజనంలో వెల్లుల్లిని చేర్చుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి గణనీయంగా దోహదపడుతుంది. బీట్ రూట్ – వైబ్రెంట్ లివర్ సపోర్ట్: తీవ్రమైన రంగుతో కూడిన బీట్ రూట్ కాలేయ పనితీరును ఆప్టిమైజ్ చేయడంలో కీలక పాత్ర పోషించే బీటాలైన్లు, ఫైటోన్యూట్రియెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. వాటి సహజ తీపిని పెంచడానికి కాల్చినా లేదా రిఫ్రెషింగ్ పానీయం కోసం రసం చేసినా, దుంపలు కాలేయ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి మీ ఆహారంలో రుచికరమైన అదనంగా ఉంటాయి. గ్రీన్ టీ – యాంటీఆక్సిడెంట్ ఎలిక్సిర్: గ్రీన్ టీ కాటెచిన్లు, యాంటీఆక్సిడెంట్లకు ప్రసిద్ధి చెందింది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఈ లక్షణాలు కాలేయ కొవ్వును తగ్గించడంలో, కాలేయ నష్టంతో సంబంధం ఉన్న ఎంజైమ్‌లను తగ్గించడంలో సహాయపడతాయి. దాని కాలేయ–రక్షణ ప్రయోజనాలను ఉపయోగించుకోవడానికి రోజువారీ గ్రీన్ టీ అలవాటును పెంపొందించుకోండి. క్రూసిఫెరస్ కూరగాయలు – డిటాక్స్ డైనమో: బ్రోకలీ, బ్రస్సెల్స్ మొలకలు, క్యాబేజీ, కాలీఫ్లవర్, కాలే క్రూసిఫెరస్ కూరగాయల కుటుంబానికి చెందినవి. ఇవి గ్లూకోసినోలేట్‌లను కలిగి ఉన్నాయి. ఈ సమ్మేళనాలు కాలేయం సహజ నిర్విషీకరణ ఎంజైమ్‌లకు మద్దతు ఇస్తాయి. పచ్చిగా, కాల్చిన లేదా వేయించిన వాటిని తిన్నా, క్రూసిఫెరస్ కూరగాయలను కలుపుకోవడం వల్ల మీ కాలేయం యొక్క శ్రేయస్సు పెరుగుతుంది.

అవకాడోలు – ఆరోగ్యకరమైన కొవ్వులు మరియు గ్లూటాథియోన్: ఆరోగ్యకరమైన కొవ్వులు, గ్లూటాథియోన్ సమృద్ధిగా ఉండే అవకాడోలు, కాలేయానికి ఫ్రీ రాడికల్ నష్టం జరగకుండా రక్షణ కవచంగా పనిచేస్తాయి. శాండ్‌విచ్‌లపై ముక్కలుగా కోసినా లేదా గ్వాకామోల్ డిప్‌గా మార్చినా, అవకాడోలు మీ కాలేయాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి రుచికరమైన పోషకమైన మార్గాన్ని అందిస్తాయి.

## ఐఆర్‌సీటీసీ ఛైర్మన్ రాజీనామా

భారతీయ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC)ఛైర్మన్ అండ్ ఎండీ సంజయ్ కుమార్ జైన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. జులై 20 నుంచి రాజీనామా అమల్లోకి రానుంది. వ్యక్తిగత కారణాలతో సంజయ్ కుమార్ రాజీనామా చేస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ''నా పదవీ కాలంలో ఐఆర్‌సీటీసీ మినీరత్న నుంచి నవరత్న హోదాకు ఎదిగింది. షెడ్యూల్‌బి జాబితా నుంచి షెడ్యూల్ ఏ జాబితాకు మారింది. వ్యక్తిగత జీవితంలో ఐఆర్‌సీటీసీ గొప్ప గౌరవాన్ని అందించింది. ఇంతకాలం మద్దతుగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు. భవిష్యత్తులో ఐఆర్‌సీటీసీ మరింత వృద్ధి సాధిస్తుంది'' అని సంజయ్ కుమార్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. నోటీస్ పీరియడ్ ముగిశాక బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. 2024 ఫిబ్రవరి 14న ఆయన ఐఆర్‌సీటీసీ సీఎండీగా బాధ్యతలు స్వీకరించారు.




# ఏఐతో ఐటీ సంస్థలకు ముప్పులేదు.. నందన్ నీలేకని కీలక వ్యాఖ్యలు



దిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగాలతో పాటు సంప్రదాయ ఐటీ సంస్థలనూ భర్తీ చేస్తుందన్న వాదనలను ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు, ఛైర్మన్ నందన్ నీలేకని తోసిపుచ్చారు. ఐటీ సంస్థల స్థానాన్ని ఏఐ భర్తీ చేయబోదని, పైగా వాటి సామర్థ్యాన్ని మరింత ఇనుమడింపజేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు సంస్థ 45 వార్షిక సాధారణ సమావేశంలో ఐటీ రంగం ఉనికి గురించి ఆయన మాట్లాడారు. 2030 నాటికి 400 బిలియన్ డాలర్ల భారీ ఏఐ ఫస్ట్ సేవల అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి తమ సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల నయా మోసం.. ఏమిటీ 'బాస్ స్కామ్'?జనరేటివ్ఏఐ వచ్చి మూడేళ్లకు పైగా అయినప్పటికీ ఇన్ఫోసిస్ గతం కంటే మిన్నగా, రాబోయే దశాబ్దానికి అనువైన దశలో ఉందని నందన్ నీలేకని పేర్కొన్నారు. అద్భుతమైన కోడింగ్ టూల్స్ అందిపుచ్చుకుని తమ ఉత్పాదకతను మరింత మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్‌లో ఇంకా చేయాల్సింది చాలా ఉందని అభిప్రాయపడ్డారు. ఇన్ఫోసిస్ లాంటి సంస్థలను ఏఐ భర్తీ చేయబోదన్నారు. ఏఐని అందిపుచ్చుకోవడంలో ముందుండే కంపెనీలను మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఏఐ విప్లవంలో అధునాతన పద్ధతులను అందిపుచ్చుకోవడం అవసరమని, ఆ పని ఇన్ఫోసిస్ చేస్తోందన్నారు. తన టాప్ 200 క్లయింట్లలో 90 శాతం కంపెనీల ఏఐ జర్నీలో ఇన్ఫోసిస్ తోడ్పడుతోందని ఈ సందర్భంగా తెలిపారు.

# దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ కల్లోలమే..!



అమెరికా యుద్ధోన్మాదం దలాల్ స్ట్రీట్‌ను గడగడలాడించే అవకాశాలు మెండుగా కనబడుతోన్నాయి. యూఎస్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్యలతో పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లలో తీవ్ర ఆందోళన మొదలయ్యింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ ముందస్తు దాడులు చేయడంతో సోమవారం దలాల్ స్ట్రీట్ భారీ నష్టాలతో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అణు ఒప్పందంపై నెలకొన్న విభేదాల నేపథ్యంలో అమెరికా అండతో ఇజ్రాయిల్ ఈ దాడులకు తెగబడటంతో వచ్చే వారం భారత మార్కెట్లు తీవ్ర ప్రతికూలతను ఎదుర్కోనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మధ్యప్రాచ్యంలో దశాబ్దాల కాలంలో ఎప్పుడూ లేనంతగా అమెరికా తన నౌకాదళాన్ని మోహరించింది. శనివారం ఇరాన్ కూడా ప్రతిదాడికి దిగడంతో ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ దేశాల మార్కెట్లను వణికిస్తున్నాయి. గత శుక్రవారం సెన్సెక్స్ 961 పాయింట్లు, నిఫ్టీ 317 పాయింట్లు నష్టపోయాయి. ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో సెన్సెక్స్ దాదాపు 2300 పాయింట్లు, నిఫ్టీ 750 పాయింట్ల వరకు లేదా 2.53 శాతం మేర పతనమయ్యాయి. సోమవారం నుంచి ఈ పతనం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వెల్త్‌మిల్స్ సెక్యూరిటీస్ డైరెక్టర్ క్రాంతి బత్తిని హెచ్చరించారు. ముఖ్యంగా ముడి చమురు ధరలు బ్యారెల్ 80 డాలర్లు దాటితే భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని ఆయన విశ్లేషించారు. ఐటి మినహా ఆటో, చమురు, ఫైనాన్షియల్, ఎఫ్ఎంసిజి రంగాలు ఇప్పటికే అమ్మకాల ఒత్తిడిలో ఉన్నాయి. ప్రస్తుతానికి పాత స్టాక్స్‌ను తగ్గించుకుని, యుద్ధ తీవ్రత తగ్గే వరకు వేచి చూడటం ఉత్తమమని మార్కెట్ నిపుణుడు అనుజ్ గుప్తా పేర్కొన్నారు. కొత్తగా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేటప్పుడు ఆచి తూచి వ్యవహారించాలన్నారు. ముఖ్యంగా రిల్ ఇన్వెస్టర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# భారత్ నుంచి 180కి పైగా విమానాలు రద్దు




ఇజ్రాయిల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై యుద్ధం ప్రకటించడంతో పశ్చిమ ఆసియా గగనతలం అల్లకల్లోలంగా మారింది. ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు పెరగడంతో శనివారం ఒక్కరోజే భారత్ నుంచి పశ్చిమ ఆసియా దేశాలకు వెళ్లాల్సిన సుమారు 180కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. గగనతలం మూసివేత, భద్రతా కారణాల దృష్ట్యా భారతీయ విమానయాన సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. దేశీయ విమానయాన దిగ్గజాలు తమ సర్వీసులను పెద్ద ఎత్తున నిలిపివేశాయని తెలుస్తోంది. ఇండిగో అత్యధికంగా సుమారు 72 విమానాలను రద్దు చేసింది. ఇరాన్ దుగా గగనతల ఆంక్షలు ఉండటంతో అర్ధరాత్రి వరకు అన్ని సర్వీసులను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. ఎయిర్ ఇండియా దాదాపు 31 సర్వీసులను రద్దు చేసింది. దుబారు, దోహా, రియాద్, జెద్దా వంటి నగరాలకు వెళ్లాల్సిన విమానాలు ఇందులో ఉన్నాయి. గల్ఫ్ దేశాలకు ప్రధాన ఆపరేటర్ అయిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పశ్చిమ దిశగా వెళ్లే అన్ని అంతర్జాతీయ సర్వీసులను నిలిపివేసింది. రోజుకు సగటున 110 సర్వీసులు నడిపే ఈ సంస్థ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. దుబారు, షార్జా వంటి నగరాలకు వెళ్లే విమానాలు ఈ యుద్ధ ప్రభావానికి లోనయ్యాయని, పలు సర్వీసులు రద్దయ్యాయని స్పైస్‌జెట్ వెల్లడించింది.

# ఎస్‌బిఐ యోనో యాప్ బ్లాక్ అవుతుందంటూ నకిలీ ప్రచారం




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యోనో యాప్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఓ నకిలీ సందేశం సోషల్ డియాలో వైరల్ అవుతోంది. ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయకపోతే యోనో యాప్ బ్లాక్ అవుతుందని ఈ మెసేజ్‌లో హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ఇదొక మోసపూరిత సందేశమని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి ఓ ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి, ఇన్‌స్టాల్ చేసుకోవాలని సైబర్ నేరగాళ్లు ఈ సందేశంలో కోరుతున్నారు. దీని ద్వారా వినియోగదారుల వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది ఒకరకమైన ఫిషింగ్ స్కామ్ అని అధికారులు హెచ్చరిస్తున్నారు. వినియోగదారులను భయపెట్టి, వారి నుంచి సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడమే ఈ మోసం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. తాము ఎప్పుడూ కూడా ఈమెయిల్స్ లేదా ఎస్ఎంఎస్‌ల ద్వారా వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు అడగమని, అలాగే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేసుకోమని కోరమని ఎస్బీఐ పలుమార్లు స్పష్టం చేసింది. వినియోగదారులు ఇలాంటి మోసపూరిత సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. యోనో యాప్‌ను కేవలం గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్ వంటి అధికారిక మాధ్యమాల నుంచే డౌన్‌లోడ్ లేదా అప్‌డేట్ చేసుకోవాలని తెలిపింది. ఇలాంటి అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని, ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఒక్కరోజే రూ.25000 పెరిగిన వెండి,బంగారం ధరలకు రెక్కలు



పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో బంగారం ముడిపడి ఉంది. అంతే కాదు పెట్టుబడి పెట్టే వారు సైతం బంగారం సురక్షితమైన మార్గంగా చూస్తున్నారు.పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండడం చాలా ముఖ్యం. గత కొద్ది నెలల నుంచి బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా పెరుగుతున్నాయి. ఇటీవల కాస్త తగ్గినట్లు కనిపించినా అమెరికా ఇరాన్ ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు పసిడి ధరలను అమాంతం పెంచేశాయి. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ క్షిపణులతో విరుచుకపడడం, ఊహించని విధంగా ఇరాన్ ప్రతిదాడులు చేయడం ఇప్పుడు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. దీంతో బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. తులం బంగారం రేటు ఏకంగా రూ.7 వేల పైన పెరిగింది. అలాగే కిలో వెండి రేటు ఒక్కరోజే రూ.25000 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు ఒక్కరోజే 100 డాలర్ల పైన పెరిగింది. దీంతో ఔన్స్ గోల్డ్ రేటు 5278 డాలర్ల పైకి చేరి ట్రేడవుతోంది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు ఒక్క . 1,68,710 వద్దకు చేరుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ. 6,550 మేర పెరిగింది. దీంతో తులం రేటు రూ.1,54,650 వద్దకు చేరుకుంది. బంగారంతో పాటు వెండి రేటు సైతం భారీగా పెరిగింది. గత రెండు రోజులు స్థిరంగా కొనసాగుతూ వచ్చిన వెండిపై ఇరాన్అమెరికా దాడులు ప్రభావం చూపించాయి. దీంతో ఒక్కరోజే కిలో వెండి రేటు రూ.25000 మేర పెరిగింది. దీంతో హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ. 3,20,000 వద్దకు చేరుకుంది.

## జీఎస్‌టి వసూళ్ళలో తెలంగాణ దూకుడు

జీఎస్టీ వసూళ్ళలో తెలంగాణ దూకుడు ప్రదర్శించింది. 2026 ఫిబ్రవరి నెలలో ఏకంగా రూ. 4,125 కోట్ల ఉ•• వసూళ్లను సాధించింది. గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే 14% వృద్ధిని నమోదు చేయడం విశేషం.దేశంలోని ఇతర అగ్రగామి రాష్ట్రాలతో పోటీ పడుతూ అలాగే దాని చుట్టూ విస్తరించిన ఐటీ, ఫార్మా, మరియు సేవా రంగాలు అని నిపుణులు చెబుతున్నారు. ఈ రంగాల నుండి వస్తున్న పన్ను ఆదాయం రాష్ట్ర ఖజానాకు వెన్నెముకగా నిలుస్తోంది. ఐటీ ఎగుమతులు పెరగడం, కొత్తగా మరిన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ కార్యాలయాలను ఇక్కడ ప్రారంభించడం ఆదాయం సమకూరుతోంది. మరోవైపు ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వల్ల రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాలు పకడ్బందీగా పర్యవేక్షిస్తోంది. డిజిటల్ లావాదేవీలు ప్రాచుర్యంలోకి రావడం వల్ల చిరు వ్యాపారుల నుండి పెద్ద కంపెనీల వరకు పన్ను పరిధిలోకి రావడం రాష్ట్ర ఆదాయానికి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. ఈ అదనపు ఆదాయంతో రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు చేపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.




## చాలా భయపడ్డా: సింధు

దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సపంలో పేలుడు తమను ఎంతో భయాందోళనకు గురి చేసిందని భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు చెప్పింది. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు ఇంగ్లాండ్ వెళ్లే క్రమంలో ఆమె దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్.. యూఏఈ సహా గల్ఫ్‌లో వివిధ ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ నేపథ్యంలో గగనతలాన్ని మూసివేయడంతో అనేక వికుంటున్న శబ్దాలు వినిపించాయి. కొన్ని గంటల తర్వాత విమానాశ్రయంలో మేం ఉంటున్న ప్రాంతానికి దగ్గర్లో పేలుడు సంభవించింది. అప్పుడు నా కోచ్ ఆ ప్రాంతానికి కేవలం 100 టర్ల దూరంలో ఉన్నాడు. మేం వెంటనే ఆ ప్రాంతాన్ని వీడాం. అంత సపం నుంచి ఇలాంటి అనుభవం ఎదుర్కోవడం భయాన్ని కలిగించింది'' అని సింధు చెప్పింది. ప్రస్తుతం తాము హోటల్లో ఉన్నామని, సురక్షితంగానే ఉన్నా.. కాస్త ఆందోళనగానూ ఉందని సింధు కోచ్ ప్రతమ అన్నాడు.

# లియోనెల్ మెస్సీ మ్యాజిక్..



మేజర్ లీగ్ సాకర్ మ్యాచ్‌లో ఇంటర్ మయామి, ఆర్లాండో సిటీపై 42 తేడాతో అద్భుతమైన విజయాన్ని సాధించింది. 02తో వెనుకబడినప్పటికీ, సెకండాఫ్‌లో మయామి పుంజుకున్న తీరు ఈ మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది. మ్యాచ్ ప్రారంభమైన వెంటనే ఫస్ట్ హాఫ్‌లో ఆర్లాండో సిటీ ఆధిపత్యం ప్రదర్శించింది. 18వ నిమిషంలో మార్కో పాసాలిక్, 24వ నిమిషంలో మార్టిన్ ఓజెడా గోల్స్ చేయడంతో ఆర్లాండో 20 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, ద్వితీయార్థంలో ఇంటర్ మయామి అనూహ్యంగా పుంజుకుని వరుసగా నాలుగు గోల్స్ చేసి విజేతగా నిలిచింది. ఫస్ట్ హాఫ్‌లో మయామి డిఫెన్స్ చాలా బలహీనంగా కనిపించింది. అయితే, విరామం సమయంలో కోచ్ జేవియర్ మాస్చెరానో చేసిన వ్యూహాత్మక మార్పులు ఏకంగా మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాయి. లెఫ్ట్ బ్యాక్ నోహ్ అలెన్ స్థానంలో యువ స్ట్రైకర్ మేటియో సిల్వెట్టిని రంగంలోకి దించడంతో అటాకింగ్ అద్భుతంగా బలపడింది. ఇక ఆ జట్టు కీలక ఆటగాడు లియోనెల్ మెస్సీ మరోసారి తన క్లాస్ ఆటను ప్రేక్షకులకు చూపించాడు. 57వ నిమిషంలో స్కోరును సమం చేసిన మెస్సీ, మ్యాచ్ చివరి నిమిషంలో అద్భుతమైన ఫ్రీకిక్‌తో రెండో గోల్ కొట్టాడు. దీంతో 22 ఏళ్లుగా నిరంతరాయంగా గోల్స్, అసిస్ట్‌లు అందించిన అరుదైన రికార్డును మెస్సీ నెలకొల్పాడు. ఇక ఈ విజయంలో వెనిజులా మిడ్‌ఫీల్డర్ టెలాస్కో సెగోవియా కీలక పాత్ర పోషించాడు. అతను ఒక గోల్ చేయడమే కాకుండా, సహచర ఆటగాళ్లు రెండు గోల్స్‌కు చేసేందుకు సహకారం అందించాడు.

# టీమ్‌ఇండియా విజయంలో సంజు శాంసన్ కీలక పాత్ర పోషించాడు




టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ బ్యాట్‌తో రాణించాడు. టీమ్ఇండియా ఈ మ్యాచ్‌లో విజయం సాధించి, సెస్ బెర్త్ ఖాయం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. 'మేం ఆడిన విధానంతో మాకు చాలా ఆనందంగా ఉంది. చావోరేవో తేల్చుకోవాల్సిన క్వార్టర్ ఫైనల్ లాంటి తుల్లోనూ ధైర్యంగా బ్యాటర్లు పరుగులు తీయాలి. ఒత్తిడి లేకుండా ఆనందం లేదు' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో సంజు శాంసన్ విఫలమైన విషయం తెలిసిందే. దీంతో టీ20 వరల్‌డ్‌కప్ 2026లో తుది జట్టులో స్థానం కోల్పోయాడు. కేవలం ఒకటి, రెండు మ్యాచుల్లో మాత్రమే ఆడే అవకాశం వచ్చింది. అయితే వాటిలోనూ పెద్దగా స్కోర్లు చేయలేదు. కానీ వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో మాత్రం సత్తా చాటాడు. 'సంజు శాంసన్ ఓ వరల్డ్ క్లాస్ ప్లేయర్. అతడు ఎంత మంచి క్రికెటరో మనందరికీ తెలుసు. అందుకే మేం అతడికి మద్దతుగా నిలిచాం. జట్టుకు అవసరమైన సమయంలో తన సత్తా చాటాడు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో తన సామర్థ్యాన్ని చూపించాడు. మిగిలిన మరో రెండు మ్యాచుల్లోనూ అతడు ఇలాగే రాణించాలని కోరుకుంటున్నా. సంజు శాంసన్‌తో పాటు ఇషాన్ కిషన్.. వీరిద్దరూ ప్రస్తుతం టీమ్ఇండియాకు కీలకమైన ఆటగాళ్లు. భవిష్యత్తులోనూ వీరు ఇలాగే పరుగులు రాబట్టాలి' అని గంభీర్ పేర్కొన్నాడు.

# మళ్లీ విఫలమైన అభిషేక్ శర్మ



టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా.. పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత యువ ఆటగాళ్లకు ఎక్కువగా అవకాశాలు లభించాయి. అందివచ్చిన అవకాశాలను కుర్రాళ్లు రెండు చేతులా అందిపుచ్చుకున్నారు. దీంతో టీ20 క్రికెట్‌లో భారత జట్టుకు తిరుగులేకుండా పోయింది. జట్టు ఏదైనా విజయమే లక్ష్యంగా బరిలోకి దిగింది. ముఖ్యంగా టీమిండియా విజయాల్లో ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ .. కీలక పాత్ర పోషించాడు. తన మెరుపు బ్యాటింగ్‌తో జట్టుకు శుభారంభాలు అందించాడు. టీ20 ప్రపంచకప్ 2026లోనూ అతడు సత్తాచాటుతాడని అంతా భావించారు. కానీ ప్రస్తుతం.. సీన్ రివర్స్ అయింది. ఎన్నో అంచనాలతో తొలిసారి టీ20 ప్రపంచకప్ బరిలోకి దిగిన అభిషేక్.. దారుణ ప్రదర్శన చేస్తున్నాడు. తొలి మూడు మ్యాచ్‌లలో వరుసగా మూడు డకౌట్లు నమోదు చేశాడు. ఆ తర్వాత 15 పరుగులు చేశాడు. గత మ్యాచ్‌లో 55 రన్స్‌తో ఫామ్‌లోకి వచ్చినట్లే కనిపించిన అభిషేక్.. తాజాగా వెస్టిండీస్‌తో కీలకమైన మ్యాచ్‌లో మరోసారి విఫలమయ్యాడు. 11 బంతుల్లో 10 రన్స్ చేసి ఔట్ అయ్యాడు. మొత్తంగా ఈ టోర్నీలో ఆడిన ఆరు ఇన్నింగ్స్‌లలో అతడు.. 80 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో మూడు డకౌట్స్ ఉన్నాయి. అభిషేక్.. 13.33 సగటుతో.. 131 స్ట్రైక్ రేట్‌తో ఈ రన్స్ స్కోరు చేశాడు. ఈ టోర్నీకి ముందు వరకు 200లకు పైగా స్ట్రైక్ రేట్‌తో రన్స్ చేసిన అభిషేక్.. ఇప్పుడు మాత్రం ఫామ్ లేక ఇబ్బంది పడుతున్నాడు. జట్టుగా బలంగా మారుతాడనకుంటే.. బలహీనతగా మారిపోయాడు. వెస్టిండీస్‌తో మ్యాచులోనూ నిరాశపరిచాడు. సెస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచులో రెండు క్యాచ్‌లు మిస్ చేసిన అతడు.. 196 పరుగుల లక్ష్య ఛేదనలో 11 బంతుల్లో 10 రన్స్ చేసి ఔట్ అయిపోయాడు. మిగతా బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. దీంతో ప్రస్తుతం ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్న అభిషేక్‌పై సోషల్ డియాలో అతడిపై విమర్శల వర్షం కురుస్తోంది.

# అభిమానులకి క్షమాపణలు




టీ20 ప్రపంచకప్ 2026 నుంచి శ్రీలంక జట్టు నిష్క్రమించింది. సూపర్ 8 చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో హోరాహోరీగా పోరాడి ఓటమి పాలవడంతో టోర్నీ నుంచి వైదొలగాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో, తమ వైఫల్యానికి కీలక ఆటగాళ్ల గాయాలే ప్రధాన కారణమని శ్రీలంక కెప్టెన్ దాసున్ షనక ఆవేదన వ్యక్తం చేశాడు. అభిమానులను నిరాశ పరిచినందుకు క్షమాపణలు కోరాడు. క్యాండీలోని పల్లెకెలె స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ నిర్దేశించిన 212 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక చివరి వరకు పోరాడింది. కెప్టెన్ షనక 76 పరుగులతో అజేయంగా నిలిచి వీరోచిత ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు. చివరికి శ్రీలంక 207 పరుగులకే పరిమితమై 5 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. ఈ ఓటమితో శ్రీలంకతో పాటు మెరుగైన నెట్ రన్‌రేట్ లేని కారణంగా పాకిస్థాన్ కూడా టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# టీ20 ప్రపంచకప్ 2026లో సెస్ చేరిన భారత్



టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీఫైనల్ చేరింది. సూపర్8లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్చువల్ నాకౌట్ లాంటి మ్యాచ్‌లో సత్తాచాటి..గ్రూప్ 1 నుంచి సెస్ చేరిన రెండో జట్టుగా నిలిచింది. 196 పరుగులను డిఫెండ్ చేసుకోలేకపోయిన వెస్టిండీస్.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. భారత జట్టు.. సెమైనల్‌లో మార్చి 5న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఈ మ్యాచ్ జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాను.. ఓపెనర్ సంజూ శాంసన్ ఒంటి చేత్తో గెలిపించాడు. ఈ టోర్నీ ఆరంభంలో తుది జట్టులో చోటు కోల్పోయిన అతడు.. కీలకమైన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. సహచర ఓపెనర్ అభిషేక్ శర్మ విఫలమైనా.. సంజూ మాత్రం దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. లక్ష్యం భారీగా ఉండటంతో సిక్స్‌లు, ఫోర్లతో అదరగొట్టాడు. ఈ క్రమంలోనే టీ20 ప్రపంచకప్‌లో తొలి హాఫ్ సెంచరీ సాధించాడు. చివరకు 50 బంతుల్లో 97 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. దీంతో భారత్.. మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. భారత బ్యాటర్లలో అభిషేక్ శర్మ (10), ఇషాన్ కిషన్ (10), సూర్యకుమార్ యాదవ్ (18) విఫలమయ్యారు. తిలక్ వర్మ (15 బంతుల్లో 27 రన్స్) క్రీజులో ఉన్నంత సేపు ధాటిగా బ్యాటింగ్ చేశాడు. ఈ ఫలితంతో టీ20 ప్రపంచకప్ 2026లో సె ఫైనల్ బెర్తులు, మ్యాచ్‌లు ఖరారు అయిపోయాయి. గ్రూప్1 నుంచి దక్షిణాఫ్రికా, భారత్ సెఫైనల్ చేరాయి. గ్రూప్2 నుంచి ఇంగ్లాండ్, న్యూజిలాండ్.. టాప్2లో నిలిచాయి. ఇక మార్చి 4న తొలి సెఫైనల్ మ్యాచ్ సౌతాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరగనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. రెండో సె ఫైనల్ మ్యాచ్ మార్చి 5న ముంబైలోని వాంఖడే క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది. ఇందులో ఇంగ్లాండ్‌తో టీమిండియా అతు తేల్చుకోనుంది. మార్చి 8న టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్.. గుజరాత్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది.

# వుదయం సినిమా

MOVIE TIME!

## మురళీమోహన్‌కు 'పద్మశ్రీ' వైభవం



**వుదయం సినిమా** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ప్రఖ్యాత నటుడిగా, అభిరుచి గల నిర్మాతగా, విజయవంతమైన వ్యాపారవేత్తగా మరియు మాజీ పార్లమెంటేరియన్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మాగంటి మురళీమోహన్‌ను అత్యున్నత పౌర పురస్కారం 'పద్మశ్రీ' వరించింది. మంగళవారం (జూన్ 23న) దేశ రాజధాని న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఘనమైన వేడుకలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు.



## కేవలం 'పెద్ది' మాత్రమే కనిపించాడు




**వుదయం సినిమా:** సినిమా చూస్తున్నప్పుడు మాకు చరణ్ కనిపించలేదు 'పెద్ది' మాత్రమే కనిపించాడు. చరణ్ ను 'న్యూ ఏజ్ మెగాస్టార్' అని పిలవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. పుత్రోత్సాహాన్ని నూటికి నూరు శాతం అనుభవిస్తున్నాను. పెద్ది చిత్రాన్ని ఆదరించి ఇంతటి ఘన విజయాన్ని ఇచ్చిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు: పెద్ది మెగా బ్లాక్‌బస్టర్ ఈవెంట్ లో మెగాస్టార్ చిరంజీవి

పెద్ది విజయం నా జీవితాన్ని మార్చేసింది. పెద్ది రిలీజ్ అయ్యే వరకు మా పాప క్లీంకార నన్ను 'నాన్న' అని పిలిచేది. విడుదలైన తర్వాత 'పెద్ది' అని పిలుస్తోంది. ఇప్పుడు అందరికీ పెద్ది పేరే గుర్తుంది.

**పెద్ది ఇంత అందమైన జ్ఞాపకాన్ని ఇచ్చింది: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్మె**

గా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. 2026 సౌత్ ఇండియా నంబర్ వన్ గ్రాసర్ గా నిలిచింది అన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమౌతోంది. ఈ సందర్భంగా మేకర్స్ పెద్ది మెగా బ్లాక్‌బస్టర్ ఈవెంట్ ని నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది. ఈ వేడుకలో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, టీమ్ సభ్యులకు మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్ చేతుల మీదుగా షీల్డ్స్ బహుకరించారు. పెద్ది మెగా బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మా అభిమానుల్లో ఆనాటి నుంచి ఈనాటి వరకు క్రమశిక్షణలో ఎలాంటి మార్పు లేదు. అదే ఉత్సాహం, అదే ప్రేమతో ఆదరిస్తూ వస్తున్న అభిమానులందరికీ నా హృదయపూర్వక అభివాదాలు. నేను ఇక్కడికి ఒక అతిథిగా, ఒక సీనియర్ నటుడిగా, సినిమాపై అపారమైన ప్రేమ ఉన్న వ్యక్తిగా వచ్చాను.

## ఖాకీ డ్రెస్సులో 'స్పిరిట్' చూపించనున్న ప్రభాస్



**వుదయం సినిమా:** రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటోన్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాలో ప్రభాస్ తొలిసారిగా పవర్‌ఫుల్ ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో శరవేగంగా జరుగుతోంది. కథ పరంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న జైలు సన్నివేశాలను దర్శకుడు సందీప్ రెడ్డి వంగా.. ప్రభాస్‌పై చిత్రీకరిస్తున్నారు. సినిమాను మరింత సహజంగా గ్రిప్పింగ్‌గా ఉంచేందుకు 'స్పిరిట్' మేజర్ షూటింగ్‌ను నిజమైన లొకేషన్లలోనే ప్లాన్ చేయడం విశేషం. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రీ కథానాయికగా నటిస్తోంది. అలాగే వివేక్ ఒబెరాయ్, ఐశ్వర్యా దేశాయ్, కాంచన, ప్రకాష్‌రాజ్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

**మరో రెండు భారీ చిత్రాలు..**

మరోవైపు, హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజి' సినిమా చిత్రీకరణ కూడా తుది దశకు చేరుకుంది.

## సోషల్ సెటైర్ గా వస్తున్న 'గాసిప్



**వుదయం సినిమా:** మోస్ట్ టాలెంటెడ్, ఎనర్జిటిక్ రాశి సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నా వైభవ్ సినీ స్కల్ప్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై యతి నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "గాసిప్". నేటి తరానికి కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, అందమైన ప్రేమ కథతో మేళవిస్తూ సోషల్ సెటైర్ గా డైరెక్టర్ వైభవ్ కౌండిన్య ద్వారా ఈ చిత్రం తెరకెక్కుతోంది. శక్తికాంత్ కార్తీక్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి సతీష్ సినిమాటోగ్రఫీ చేయగా జై కుమార్ ఎడిటింగ్ చేశారు. రవివర్మ కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రంలో మహేష్ యడ్లపల్లి, 30 ఇయర్స్ పృథ్వీ రాజ్, ఆర్టిస్ట్ విజయ్ అదిరాజు, గురు చరణ్, ఫాల్గుణి, శృతి తదితరులు నటించగా ఈ నెల 26న విడుదలకు సిద్ధమవగా ప్రముఖ దర్శకుడు సాయి కిరణ్ అడివి చేతుల మీదగా ఈ చిత్ర లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నటుడు మహేష్ యడ్లపల్లి మాట్లాడుతూ... "అందరికి నమస్కారం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సాయి కిరణ్ అడివి గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రస్తుత సమాజంలో చూస్తున్న కొన్ని సంఘటనలకు దగ్గరగా ఉన్న ఒక విషయాన్ని సినిమాగా చేశాము. ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. నాకు అవకాశం ఇచ్చిన వైభవ్ గారికి, యతి గారికి థాంక్స్. రాశి సింగ్ గారితో పని చేయడం సంతోషకరం. శక్తి కాంత్ కార్తీక్ గారు సినిమాకు మంచి సంగీతాన్ని అందించారు. అందరూ మా సినిమాకు సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను" అన్నారు. నటుడు గురు చరణ్ మాట్లాడుతూ... "గాసిప్ చిత్రం కోసం నాకు వైభవ్ గారు కాంటాక్ట్ చేశారు.

## "వేదవ్యాస్ "లో మురళీ మోహన్



**వుదయం సినిమా:** "ప్రముఖ దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి గారి దర్శకత్వంలో మా "సాయి ప్రగతి ఫిలిమ్స్ " నిర్మిస్తున్న తొలి చిత్రం "వేద వ్యాస్ " లో ఒక ప్రత్యేక పాత్ర పోషించిన ప్రఖ్యాత నటులు , నిర్మాత మురళీమోహన్ గారికి 86వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మా చిత్రంలో ఆయన గెటప్ ను రివీల్ చేస్తున్నాము " అన్నారు చిత్ర నిర్మాత, మాజీ శాసన సభ్యులు కొమ్మూరి ప్రతాపరెడ్డి. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ " మా చిత్రంలో హైందవ ధర్మ విశిష్టతను చాటే ప్రత్యేక ప్రభోధాత్మక పాత్రలో నటించిన మురళీమోహన్ గారు భారత ప్రభుత్వం వారి ప్రతిష్టాత్మక "పద్మశ్రీ అవార్డు" ను స్వీకరిస్తున్న సందర్భం (జూన్ 23) లోనే ఆయన జన్మదినం (జూన్ 24) కూడా కలిసి రావడం యాదృచ్ఛిక విశేషం. ఈ ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డును కేంద్ర ప్రభుత్వం నుండి ఆయన అందుకుంటున్న "బర్త్ డే గిఫ్ట్ " గా భావిస్తూ ఈ రెండు ఆహ్లాదకర సందర్భాలను పురస్కరించుకొని మా సాయి ప్రగతి ఫిలిమ్స్ పక్షాన అజాత శత్రువు మురళీమోహన్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న మా "వేద వ్యాస్ " చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తాం" అన్నారు కొమ్మూరి ప్రతాపరెడ్డి.

## ఘనంగా ఆహా ఓటీటీ 'టాప్ తెలుగు ఇన్ఫ్లుయెన్సర్' షో




**వుదయం సినిమా:** సరికొత్త కంటెంట్ తో ఆడియెన్స్ ను ఎప్పటికప్పుడు కొత్తగా ఎంగేజ్ చేస్తున్న ఆహా ఓటీటీ టాప్ తెలుగు ఇన్ఫ్లుయెన్సర్ పేరుతో మరో ఇన్నోవేటివ్ షోను మన ముందుకు తీసుకొస్తోంది. జూలై 3వ తేదీ నుంచి ఈ షో ఆహాలో స్ట్రీమింగ్ కాబోతోంది. మంచు లక్ష్మి, వైవా హర్ష, రశ్మి ఈ కార్యక్రమానికి జ్యూరీగా వ్యవహరించనున్నారు. గ్రాండ్ పా కిచెన్ టీమ్, సింధు, దియాన వండర్ వుమెన్, అమృత ఫ్యాషనిస్టా, రవి యోలో గయ్, అనిరుధ్ అండ్ ప్రవీణ, ద దబిడి దిబిడి కపుల్, గౌతమ్ ఉత్తరాంధ్ర మెరుపు, అఖిల్ జాక్సన్ టాప్ తెలుగు ఇన్ఫ్లుయెన్సర్ టైటిల్ కోసం పోటీ పడుతున్నారు.

## 'వసుదేవసుతం' చిత్రం అందరికీ నచ్చుతుంది



**వుదయం సినిమా:** రెయిన్‌బో సినిమాస్ బ్యానర్ మీద ధనలక్ష్మి బాదర్ల నిర్మాణంలో వైకుంఠ్ బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. ఈ సినిమాలో మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించారు. ఇప్పటి వరకు మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సినిమాని జూలై 10న రిలీజ్ చేయబోతోన్నారు. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం నాడు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఒరిస్సాలోని వాసుదేవుని ఆలయం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆలయంలోని బ్రహ్మ పదార్థం కోసం శత్రు మూకలు చేసే విన్యాసాన్ని అడ్డుకునే పాత్రలో హీరో మహేంద్రన్ అదరగొట్టేశారు. యాక్షన్ సీక్వెన్స్, బీజీఎం అన్నీ కూడా అద్భుతంగా ఉన్నాయి. 'ఆయుధం వస్తోంది'.. 'దేవుడి అస్థిత్వాన్ని ప్రశ్నించే ఎవ్వడికీ భూమ్మీద బతికే హక్కు లేదు'.. అనే డైలాగ్స్.. ట్రైలర్ చివర్లో గరుత్మంతుడి షాట్ అదిరిపోయాయి. ట్రైలర్ ఒక్కసారిగా ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేసింది. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో.. మాస్టర్ మహేంద్రన్ మాట్లాడుతూ .. ''వసుదేవసుతం' కోసం నిర్మాతలు చాలా కష్టపడ్డారు.

## ఘనంగా "నా గురించి నీకు తెలియాలి" మూవీ ప్రారంభం

**వుదయం సినిమా:** జ్ఞానమ్మ కలివెల సమర్పణలో సంజన మూవీ మేకర్స్ పతకం పై విశ్వ, ఐశ్వర్య, అనూష హీరో హీరోయిన్లుగా వెంకటేష్ కలివెల ను దర్శకుడిగా పరిచయం చేస్తూ సంజన కలివెల నిర్మిస్తున్న "నా గురించి మీకు తెలియాలి" లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్టైన్మెంట్ చిత్రం ఇటీవల ప్రారంభం అయినది. హీరో హీరోయిన్లు పై చిత్రికారంచిన ముహూర్తము సన్నివేశానికి క్లాప్ అమిత్ తివారి, కెమెరా స్విచ్ ఆన్ కుమారి సంజన, వెంకటేష్ ఫస్ట్ షాట్ డైరెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేష్ కలివెల మాట్లాడుతూ.... రొమాంటిక్ ఎంటర్టైన్మెంట్ తో సాగె ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అని ఈచిత్రంలో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లు ఉంటాయి, ముఖ్యంగా హీరో "నా గురించి నీకు తెలియాలి" అని చెప్పే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ సినిమాకె హైలైట్ అన్నారు. నిర్మాత సంజన కలివెల మాట్లాడుతూ.... ఈనెల ఆఖరు నుంచి భీమవరం, నర్సాపురం, అంతర్వేది పరిసర ప్రాంతాలలో ఏకాదాటి గా 34 రోజుల్లో షూటింగ్ పూర్తిచేస్తామన్నారు. హీరో విశ్వ మాట్లాడుతూ... నా మొదటి సినిమాకె ఇలాంటి యాక్టింగ్ స్కోప్ ఉన్న కథ రావటం అదృష్టంగా భావిస్తున్నాను.

హీరోయిన్ ఐశ్వర్య మాట్లాడుతూ... ఈసినిమాలో నేను మీ పక్కింటి అమ్మాయిలా గ్లామర్ గా కనిపిస్తాను. హీరోయిన్ అనూష మాట్లాడుతూ... ఈచిత్రంలో నేను ప్లే చేసే రోల్ అందరికి నచుతుందిన్నారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.